ప్రజాశక్తి

శనివారం 2 ఆగస్టు 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

బల్క్ డ్రగ్ పార్కుతో తీవ్ర నష్టం

- శ్మశానంగా మారనున్న నక్కపల్లి మండలం
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం తదితరుల హెచ్చరిక
- ప్రభుత్వ తీరుపై మత్స్యకారులు, రైతుల భారీ ర్యాలీ

ప్రజాశక్తి - నక్కపల్లి

ప్రమాద భరిత బల్క్ డ్రగ్ పార్కుతో నక్కపల్లి ప్రాంతంలో తీవ్ర నష్టం జరుగనుందని, ఈ ప్రాంత మంతా శ్మశానంలా మారనుందని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద ఈ నెల 6న బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు కోసం తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలని, పరిశ్రమ ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బల్క్ డ్రగ్ పార్కు ప్రభావిత గ్రామాలకు చెందిన మత్స్యకారులు, రైతులు నక్కపల్లిలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, స్థానిక జెడ్‌పిటిసి సభ్యులు కాసులమ్మ, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైసిపి నేత వీసం రామకృష్ణ, మత్స్యకార నాయకులు ఎర్రిపిల్లి నాగేష్ తదితరులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. సారిపల్లి పాలెం జంక్షన్ నుంచి జాతీయ రహదారి మీదుగా బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును ఉపసంహరించుకోవాలని, ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలని, బల్క్ డ్రగ్ పార్క్ వస్తే జరిగే ప్రమాదాలను వివరిస్తూ ఆ ర్యాలీలో అస్థిపంజరాలతో కూడిన బ్యానర్లు కట్టుకొని నిరసనకారులు ముందుకు కదిలారు. ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. డిటి నారాయణరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కె.లోకనాథం మాట్లాడుతూ ప్రజల మనో భావాలను అర్థం చేసుకో కుండా బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయడం పచ్చి దుర్మార్గమైన చర్యని అన్నారు. 2011 నుంచి ఈ ప్రాంత రైతాంగం, మత్స్యకారులు భూసేకరణను వ్యతిరేకిస్తూనే ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ సంస్థ అయిన వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షిస్తామని చెప్పి, ఆ మాటను తప్పి, నక్కపల్లి ప్రాంతంలో ప్రైవేటు మిట్టల్ స్టీల్ ప్లాంట్‌ను మిగతా 2లో..

నక్కపల్లిలో సాగుతున్న భారీ ర్యాలీ

మాట్లాడుతున్న లోకనాథం

అందరూ కానిస్టేబుళ్లు !

- గతంలో ముగ్గురికి.. తాజాగా ఒకరికి ఉద్యోగం
- వడ్డాదికి చెందిన పైడిరాజు, లక్ష్మిల కుటుంబ ఘనత

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట

ఒక కుటుంబంలో నలుగురికి ప్రభుత్వ ఉద్యోగాలు దక్కడం అరుదైన విషయం. అదీ పోలీసు శాఖలోనే ఆ ఉద్యోగాలు రావడం అంత ఆషామాషీకాదు. ఎంతో కష్టపడేతత్వం, అంకితభావం అవసరం. సరిగ్గా ఈ లక్షణాలనే ప్రోదిచేసుకుని పోలీసు ఉద్యోగాలను దక్కించుకుంది బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామానికి చెందిన నేతల పైడిరాజు, లక్ష్మిల కుటుంబం. వివరాల్లోకి వెళ్తే.. పైడిరాజు, లక్ష్మి దంపతులది వ్యవసాయ కూలీ కుటుంబం. వారికి తారకేశ్వర రావు, పవన్, మోహన్ సంతానం. లక్ష్మి, పైడిరాజు కూలి పనులు చేసుకుంటూ కుమారులను చదివించారు. 2021లో పైడిరాజు మృతి చెందాడు. అయినప్పటికీ తల్లి బిడ్డలను వారు అనుకున్న లక్ష్యాలవైపు నడిపింది. ఆ కుటుంబంలో తొలుత పెద్ద కుమారుడు తారకేశ్వరరావుకు 2009లో కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం ఆయన విశాఖలో కోర్టు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఆయన సతీమణి సంధ్య అనకాపల్లి జిల్లా ఎస్‌పి కార్యాలయంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తోంది. తాజాగా విడుదల చేసిన ఎపి కానిస్టేబుల్ ఫలితాల్లో లక్ష్మి రెండో కుమారుడు మోహన్ సిటీ సివిల్ కానిస్టేబుల్‌గా సెలెక్ట్ అయ్యాడు. మూడో కుమారుడు పవన్ ఈ ఏడాది ఐటిబిపి ఫలితాలలో కానిస్టేబుల్‌గా సెలెక్టయి తమిళనాడులో శిక్షణ పొందుతున్నాడు. ఇలా ఒకే కుటుంబానికి నలుగురు కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచారు. తండ్రి చనిపోయిన తర్వాత తారకేశ్వరరావు మార్గదర్శకత్వంలో మిగిలిన వారు నడిచి విజయం సాధించారు. వారికి పలువురు అభినందనలు తెలిపారు.

పోలీసు కొలువులు దక్కించుకున్న ఆ నలుగురు

29 నుంచి ప్రో కబడ్డీ లీగ్ -12

వార్త 2లో..

హామీల అమల్లో కూటమి విఫలం : బొత్స

వార్త 2లో..

లూలూకు భూకేటాయింపులు రద్దు చేయాలి

వార్త 8లో..

అనుమతుల్లేని ఫెర్టిలిటీ సెంటర్లపై చర్యలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలోని అనుమతుల్లేని ఫెర్టిలిటీ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు హరింధిర ప్రసాద్ వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం తన కార్యాలయ సమావేశ మందిరంలో మాతా శిశుమరణాలు, వ్యాధి నిరోధక టీకాలు, మలేరియా, డెంగీ వ్యాధులు, ఇతర వైద్య అంశాలపై వెద్యాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన దంపతులు, గర్భిణులు, శిశువుల రిజిస్ట్రేషన్లను సక్రమంగా నమోదు చేయాలని తెలిపారు. హైరిస్క్ కేసులు, బరువు తక్కువగల పిండాల కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి పౌష్టికాహారం సక్రమంగా అందించాలని, హైరిస్కుగల కేసులను ముందుగానే ఆసుపత్రులకు తరలించి మాతాశిశు మరణాలను కంట్రోల్ చేయాలని తెలిపారు. అవసరమైన చోట ఆశా వర్కర్లు, ఎఎన్‌ఎంలకు తగిన తర్ఫీదు ఇవ్వాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్నవారి పట్ల కఠినంగా మిగతా 2లో..

హెచ్‌ఎస్‌ఎల్ సిఎమ్‌డిగా

గిరిదీప్ సింగ్‌కు అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హిందుస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా గిరిదీప్ సింగ్ శుక్రవారం నుంచి అదనపు బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఆయన హెచ్‌ఎస్‌ఎల్ డైరెక్టర్ (స్ట్రాటజిక్ ప్రాజెక్ట్)గా ఉన్నారు. ఆయన ఉద్యోగ కాలంలో షిప్స్, సబ్‌మెరైన్ విభాగం షిప్‌యార్డ్ చరిత్రలో అత్యధిక వేల్యూ ఆఫ్ ప్రొడక్షన్‌ని సాధించడమే కాకుండా రెండుసార్లు బెస్ట్ షిప్ రిపేర్ ఫెసిలిటీని దక్కించుకుంది.

పూణేలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థి అయిన గిరిదీప్ సింగ్ బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ పొందారు. ఆయన నావల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, ఐఎన్ఎస్ శివాజీ లోనావాలా నుండి మెకానికల్ ఇంజినీరింగ్‌లో పట్టభద్రుడయ్యారు, 2002లో వెల్లింగ్టన్‌లోని డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్ నుండి సైన్స్‌లో మాస్టర్స్ పట్టా పొందారు. ఆయన ముంబైలోని నావల్ వార్ కాలేజ్ నుండి మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో సర్టిఫికేషన్ కోర్సును, గుర్గావ్‌లోని ఎండిఐ నుండి బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సును కూడా పూర్తి చేశారు. అంతేకాకుండా న్యూక్లియర్ మిగతా 2లో..

పూర్వ సిఎమ్‌డి ఖత్రి నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న గిరిదీప్ సింగ్

మొదటి పేజీ తరువాయి..

బల్క్ డ్రగ్ పార్కుతో తీవ్ర నష్టం

తీసుకువస్తోందన్నారు. దానికోసం ఎన్నో మాయమాటలు చెబుతోందన్నారు. ప్రయివేటు కంపెనీల యాజమాన్యాలకు ప్రభుత్వం భరోసాగా నిలుస్తోందని తెలిపారు. కానీ ఈ ప్రాంత రైతాంగం, మత్స్యకారులకు మాత్రం ఎటువంటి భరోసానూ ఇవ్వడం లేదన్నారు. ఈ ప్రాంతంలో 9475 వేల ఎకరాల భూసేకరణ చేపట్టనున్నారని, అదే జరిగితే భవిష్యత్తులో నక్కపల్లి అనేది కనిపించే అవకాశం లేదని అన్నారు. ఈ ప్రాంతంలో హెటిరో, డెక్కన్ పరిశ్రమలు ఏర్పాటు చేసిన తర్వాత మత్స్యకారుల జీవన విధానాలు ఎలా మారిపోయాయో అందరికీ తెలుసునన్నారు. హెటిరో కాలుష్యం కారణంగా రాజయ్యపేట మత్స్యకారులు కేన్సర్, చర్మ వ్యాధులతో పాటు వివిధ రకాల అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం శ్మశానంగా మారిపోవడం తప్ప వేరే అవకాశం లేదన్నారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు కోసం తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం చట్ట విరుద్ధమన్నారు. ఎక్కడైతే పరిశ్రమలు స్థాపిస్తారో, ప్రజలు స్వచ్ఛందంగా ఎక్కడైతే పాల్గొంటారో ఆ ప్రాంతం వద్ద ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని చట్టం చెబుతోందన్నారు. పరిశ్రమలు నెలకొల్పే ముందు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజలు, సర్పంచులు, ఎంపిటిసిల నుంచి అభిప్రాయాలు సేకరించాలని, 80 శాతం మంది ప్రజలు ఆమోదిస్తేనే కంపెనీని తీసుకురావాలని, ఆ రకమైన ప్రయత్నమే నక్కపల్లి మండలంలో చేయలేదని అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణకు ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి వారి అభిప్రాయాలను చెప్పే విధంగా హోం మంత్రి అనిత చూడాలని, పోలీసు బలగాల మోహరిస్తాం, నిర్బంధిస్తాం అంటే కుదరదని అన్నారు. సన్న, చిన్నకారు రైతుల నుండి భూములు లాక్కొని పెట్టుబడుదారులకు, కార్పొరేట్ శక్తులకు భూములు అప్పగించే ప్రయత్నం విరమించుకోవాలన్నారు. అప్పలరాజు, శీరం నరసింహమూర్తి, వీసం రామకృష్ణ మాట్లాడుతూ బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును, ప్రజాభిప్రాయ సేకరణను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు లొడగల చంద్రరావు, సురకాసుల గోవింద్, తళ్ళ భార్గవ్, గంటా తిరుపతిరావు, ఎం.రాజేష్, ఎలమంచిలి తాతబాబు, జి.బాబూరావు, ఎం.మహేష్ బాబు, పిక్కి తాతీలు, చొక్కా కాశీ, సోమేశ్వరరావు, గోవింద్, బాబీ, కాశీరావు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

హెచ్ఎస్ఎల్ సిఎమ్‌డిగా గిరిదీప్ సింగ్‌కు అదనపు బాధ్యతలు

బయోలాజికల్, కెమికల్ డిఫెన్స్ స్పెషలిస్ట్‌గా కూడా అర్హత కలిగి ఉన్నారు.

ఇండియన్ నేవీలోనూ బాధ్యతలు

హెచ్ఎస్ఎల్‌లో చేరడానికి ముందు భారత నావికాదళంలో 35 సంవత్సరాలపాటు సేవలందించారు. షిప్, షోర్ అసైన్‌మెంట్‌లలో పనిచేశారు. నేవీలో ఆయన నిర్వహించిన ముఖ్యమైన అసైన్‌మెంట్‌లలో భాగంగా ఫ్రంట్‌లైన్ యుద్ధనౌకలైన ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ గోదావరి, ఐఎన్ఎస్ బెట్వాలలో పనిచేశారు. అంతేకాకుండా ముంబైలోని నావల్ డాక్‌యార్డ్‌లో ప్రొడక్షన్ మేనేజర్‌గాను, ముంబైలోని ఫ్లీట్ మెయింటెనెన్స్ యూనిట్ తాలూకా ప్రొడక్షన్, ప్లానింగ్ మేనేజర్‌గాను, వెస్ట్రన్ నావల్ కమాండ్‌లో కమాండ్ రీఫిట్ ఆఫీసర్‌గాను, పోర్ట్‌బ్లెయిర్‌లోని నావల్ షిప్ రిపేర్ యార్డ్ కమోడోర్ సూపరింటెండెంట్‌గానూ పనిచేశారు. యుద్ధనౌకల రీఫిట్‌లు, వ్యూహాత్మక జలాంతర్గామిల నిర్మాణ ప్రాజెక్టులు, ఉత్పత్తి కార్యకలాపాలలో ఆయనకు అపార అనుభవం ఉంది. ఆయన ప్రస్తుతం ఐహెచ్‌క్యూలో ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ ప్రాజెక్ట్ ప్రిన్సిపల్ డైరెక్టర్‌గా ఉన్నారు.

అనుమతుల్లేని ఫెర్టిలిటీ సెంటర్లపై చర్యలు

వ్యవహరించాలని జిల్లా వైద్యాధికారి జగదీశ్వరరావుకు సూచించారు. అబార్షన్లు అధికంగా చేస్తున్న ఆసుపత్రులపై నిఘా పెట్టాలని తెలిపారు. బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్లు, షాపింగ్ మాల్స్‌లో పిల్లలకు మిల్క్ ఫీడింగ్ గదులను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో నడుస్తున్న స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు జరక్కుండా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఐవిఎఫ్ సెంటర్లపై పటిష్ట నిఘా ఉంచాలని, ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న దివాన్ మైథీన్

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖపట్నం : ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను అటవీ సంరక్షణాధికారి (విశాఖపట్నం సర్కిల్) బిఎమ్.దివాన్ మైథీన్ శుక్రవారం ఉదయం విశాఖ నగరంలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. పత్రిక గొప్పతనాన్ని కొనియాడారు. మరింతగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రజాశక్తి బ్యూరో చీఫ్ ఎన్.మధుసూదనరావు, ఎడివిటి ఇన్‌ఛార్జి ఎస్.రాజేష్ రెడ్డి, ప్రతినిధులు సంతోష్, దేముడు బాబు, డి.రాజేష్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై నిరసనలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్మార్ట్ మీటర్లతో కలిగే నష్టాలను వివరిస్తూ శుక్రవారం విశాఖ నగరంలోని టౌన్ కొత్త రోడ్డు తారక రామారావు కాలనీలో సిపిఎం జగదాంబ జోన్ కన్వీనర్ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. సీనియర్ నాయకులు వై.రాజు మాట్లాడారు. సిఐటియు జోన్ ప్రధాన కార్యదర్శి కర్రి చంద్రశేఖర్, అప్పన్న, దానయ్య పాల్గొన్నారు. స్థానికంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో తారక రామారావు కాలనీ ప్రజలు, మహిళలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న తారక రామారావు కాలనీ వాసులు

రాంబిల్లి : విద్యుత్ చార్జీలు భారీ వచ్చే అదాని స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్మార్ట్ మీటర్ ఇంటికి పెట్టొద్దని, కరెంట్ చార్జీలు తగ్గించాలని కోరుతూ రాంబిల్లిలో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదానీ కంపెనీలకు లాభాలు చేకూర్చడానికి ప్రజలకు స్మార్ట్ మీటర్లు భారాలను మోపుతున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జి.దేముడు నాయుడు, నాయకులు చందక రామకృష్ణ, ఎన్ నారాయణరావు, రుత్తల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట మండల కేంద్రంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సిఐటియు, ఐద్వా ఆధ్వర్యాన కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి.వరలక్ష్మి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వ విద్యుత్ సంస్కరణల్లో భాగంగానే అదాని స్మార్ట్ మీటర్లు అమర్చుతున్నారని తెలిపారు. ఇప్పటికే స్మార్ట్ మీటర్లు అమర్చిన చోట కస్టమర్లకు షాక్ తగిలే విధంగా విద్యుత్ బిల్లులు వస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అప్పారావు, చిరంజీవి, నూకరాజు, శివ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరిలోవ : స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించాలని పిలుపునిస్తూ అడ్డుకోవాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఆరిలోవ సిఐటియు కార్యాలయంలో సిఐటియు, ఎఐటియుసి, ఐద్వా, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. విద్యుత్ భారాలపై శనివారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద, 5న సంస్థ కార్పొరేట్ కార్యాలయం వద్ద నిరసనలు జయప్రదం చేయాలన్నారు.

కార్యక్రమంలో సిఐటియు మద్దిలపాలెం జోన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.నరేంద్రకుమార్, డి.అప్పలరాజు, పి.శంకర్, సిపిఐ నాయకులు కె.లక్ష్మణరావు, సి.హెచ్. కాసుబాబు, ఐద్వా నాయకులు వి.శాంతి, కె.కుమారీ, ఎన్ఎఫ్‌డబ్ల్యు మహిళా సంఘం నాయకులు ఎ.దేవుడమ్మ, ఎఐవైఎఫ్ నాయకులు కె.సంతోష్, పుష్ప పాల్గొన్నారు.

హామీల అమల్లో కూటమి విఫలం : బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రజలకిచ్చిన హామీల అమల్లో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో ఆయన శుక్రవారం మాట్లాడుతూ వైసిపి ఒత్తిడి చేస్తేనే అరకొరగానైనా పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయన్నారు. ఎక్కడ చూసినా మహిళలపై అత్యాచారాలు, హత్యలు సాధారణమైపోయాయన్నారు. జగన్ పర్యటనకు వస్తున్న జనాన్ని చూసి టిడిపి కూటమి నేతలు ఓర్వలేకున్నారన్నారు. లూలూ సంస్థకు విశాఖలో భూములను ఇష్టానుసారంగా కట్టబెట్టారన్నారు. బహిరంగ మార్కెట్‌లో వాళ్లు పెట్టిన పెట్టుబడి చాలా తక్కువేనని, కానీ వాళ్లకు ఎక్కడా లేని విధంగా 99 సంవత్సరాలకు లీజు ఇస్తున్నారని తెలిపారు.

అంతులేని భూదోపిడీకి చంద్రబాబు, ఆయన మంత్రివర్గ సహచరులు పాల్పడుతున్నారని తెలిపారు. సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు, శాసనమండలి సభ్యులు పెనుమత్స వీరవెంకట సూర్యనారాయణరాజు (సురేష్ బాబు) పాల్గొన్నారు

మహావృక్షాలను పరిరక్షించుకోవాలి

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : మహావృక్షాలను పరిరక్షించుకోవాలని దానికోసం రాఖీ కట్టాలని విఎంఆర్ డిఎ కమిషనర్ కె.ఎస్‌విశ్వనాథన్ పిలుపునిచ్చారు. శుక్రవారం దొండపర్తి రైల్వేగెస్ట్‌హౌస్ దగ్గర 138 సంవత్సరాల మహా మర్రివృక్షానికి గ్రీన్‌క్లైమేట్ టీం ఎన్జీవో నేతత్వంలో సెంట్ జోసెఫ్ కళాశాల, లిటిల్ ఏంజెల్స్ విద్యార్థినులతో రాఖీ కట్టి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. లేబర్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మోహనలక్ష్మీ మాట్లాడుతూ భూమి మీద ఏ జీవి అంతరించినా దాని ప్రభావం మానవాళి మీద ఉంటుందని పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా వృక్షాబంధన కార్యక్రమం నిర్వహించడం అవసరం అని పేర్కొన్నారు. విశాఖపట్నం పోర్టు ఉద్యానవనశాఖాధికారి రాధిక మాట్లాడుతూ చెట్లను కాపాడుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో తమ సంస్థ 10 లక్షల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులంతా చేయి చేయి పట్టుకుని మర్రివృక్షం చుట్టూ ఒక వలయంలా తయారై మహా వృక్షాలను కాపాడుకుంటామని పేర్కొన్నారు. వనమాలి సిటిజి గ్రూప్ విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, కోఆర్డినేటర్ జె.రాజేశ్వరి, వనమాలి సిటిజి అడ్మిన్ మళ్ళ సరిత, ప్రతినిధులు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ విశాఖపట్నం ఫ్యామిలీ జడ్జి కమ్ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
F.C.O.P. 2544/2024
బిట్వీన్
శ్రీమతి తక్కెళ్లపాటి సీతాభూలక్ష్మి ...పిటీషనర్
అండ్
శ్రీ తక్కెళ్లపాటి కిరణ్ కుమార్ ...రెస్పాండెంటు
నోటీసు
To,
రెస్పాండెంట్:
శ్రీ తక్కెళ్లపాటి కిరణ్ కుమార్
S/o. టి.శేషగిరిరావు, హిందు,
వయస్సు:44 సం॥లు, ప్రస్తుత నివాసం:
డోర్ నెం. 14-469, కనకదుర్గానగర్,
ఆరిలోవ, విశాఖపట్నం.
పైనెంబరు పిటీషన్‌లో పైతెలిపిన పిటీషనర్ గారు మీపై అండర్ సెక్షన్ 13(1)(ia) & (ib) ఆఫ్ హిందు మ్యారేజ్ యాక్ట్ 1955 ప్రకారం విడాకుల కొరకు పైపిటీషన్ దాఖలు చేసినారు. సదరు పిటీషన్ నందు కోర్టుద్వారా పంపిన నోటీసులు మీరు అందుకొనని కారణంగా ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీచేసియున్నారు. కావున పైపిటీషన్‌లో మీహాజరు కొరకు **తేది. 26-08-2025**న వాయిదా అయివున్నది. ఆ దినమున మీరు **ఉ॥గం॥ 10.30 ని॥**లకు స్వయంగా గానీ, వకీలు ద్వారాగాని పైతెలిపిన శ్రీకోర్టులో హాజరై మీఆక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేనియెడల పైపిటీషన్‌లో మీకు ఎటువంటి ఆక్షేపణలు లేవని భావించి శ్రీ కోర్టువారు మీ పరోక్షమందు తీర్మాణించెదరని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.
(By order of the Hon'ble Court)
M.P. RADHA KUMARI, M.Sc. M.A.(Psy),LLB
Advocate
Visakhapatnam. **Cell: 94907 91500**

29 నుంచి ప్రో కబడ్డీ లీగ్ -12

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: కబడ్డీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్ వచ్చేస్తోంది. ఆగస్టు 29న విశాఖపట్నం వేదికగా ప్రారంభం కానుంది. విశాఖతో పాటు జైపూర్, చెన్నై, ఢిల్లీ వేదికలగా నిర్వహించనున్న ఈ పోటీల్లో 12 జట్లు తలపడనున్నాయని ప్రో కబడ్డీ లీగ్ కమిషనర్ అనుపమ్ గోస్వామి తెలిపారు. శుక్రవారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు.

IN THE HON'BLE COURT OF THE II ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) AT: VISAKHAPATNAM
O.S.1602/2023
Between:
State Bank of India, **SMECC Branch,**
Maharanipeta, Visakhapatnam,
Rep. by its Manager ...Plaintiff
And:
Sri Venkateswara Internet &
Game Zone, Rep. by its
Proprietor & another ...Defendants
SUMMONS
To,
D-1: Sri Venkateswara Internet & Game Zone, Rep. by its Proprietor
Sri S. Balachandar, 1st Floor,
Dadi Complex, N.A.D. Kotha Road,
Opp. Hotel Alfa, Ward-87,
Visakhapatnam-18.
D-2: Sri Siriguppa Balachandar,
S/o. S. Narasimhaiah, Hindu,
aged 31 years, R/at Flat No.401,
GN Rehain Heights,
Marripalem VUDA Layout,
Beside Siva Sivani School,
Marripalem, Visakhapatnam-18.
Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **20-08-2025** for your appearance on that day at **10:30 A.M**. you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be heard and determined in your absence, ex-parte as per law.
(By Order of the Hon'ble Court)
K.S. SHANKAR,
Advocate
Ram Nagar, Visakhapatnam.

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS, AT :: VIJAYAWADA
Arbitration Claim Petition No. 44/2025
Between:-
Kapil Chits (Kosta) Pvt. Ltd,
Rep. By it's Assistant Divisional Manager,
Governorpeta Branch, Vijayawada.
...Disputant
And
Rejeti Ramesh & Others
...Opponents
Notice to Opponents 1 to 4
1. Rejeti Ramesh, S/o.Krishna, R/o. Flat No. 401, Chandra Heights, Bakkanna palem, Madhurawada, Visakhapatnam, Visakhapatnam District.
(Opponent No. 1)
2. Kanapala Bala Babu S/o. Ramana, R/o. LIG-1, H. No. 137, APHB Colony, Ramalayam, PM Palem, Last Bus Stop, Visakhapatnam, Visakhapatnam District.
(Opponent No. 2)
3. Nallamothu Hanuma, S/o. Venkateswarlu, R/o. Flat No. 304, Votkarsha Apartment, Bakkannapalem, Near St. Anna's School, Visakhapatnam, Visakhapatnam District.
(Opponent No. 3)
4. Rajapantula Phalguna Rao, S/o. Mruthyanjaya Rao, R/o. Flat no 104, Chandra Heights, Bakkannapalem, Madhurawada, Visakhapatnam, Visakhapatnam District.
(Opponent No.4)
Please take notice that the above Claim Petition had filed for recovery of claim amount and the Honourable Deputy Chit Registrar ordered notice to all of you and posted the case to 22-08-2025 for your appearance. So all of you are here by requested to appear before the office of Honourable Deputy Registrar of Chits Vijayawada, D. No. 55-6-7A, Opposite to Priya Childeren Hospital, Pantakaluva Road, Maruthi Colony, Patamata, Vijayawada- 520010 on 22-08-2025 at 11-30 A.M. in person or through your Advocate, failing which the matter will be decided in your absence.
(By order of the Honourable Deputy Registrar)
Hearing Date: 22-08-2025
A. Prasoon Kumar,
Advocate
Vijayawada

హెల్మెట్‌ధారణపై అవగాహన

ప్రజాశక్తి -మధురవాడ : రోడ్డు ప్రమాద సమయంలో ప్రాణరక్షణకు హెల్మెట్‌ధారణ ఎంతో కీలకమని పిఎం పాలెం ట్రాఫిక్ సిఐ నల్లి సాయి అన్నారు. శుక్రవారం కారు షెడ్ కూడలి వద్ద గాయత్రి ఇంజనీరింగ్ కాలేజీ మెకానికల్ సెకెండియర్ విద్యార్థులతో కలిసి బైకిస్టులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని ఎల్‌వి పాలెం గ్రామపంచాయతీలో టీబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం భాగంగా సర్పంచ్ లొడగల రమణ ఆధ్వర్యంలో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వయోవృద్ధులు, ధూమపానం అలవాటున్న వారు, మధుమేహం, పాత క్షయవ్యాధిగ్రస్తులకు కఫం పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి లొడగల వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి అనురాధ, టిబి సూపర్వైజర్ ఇ.వీరబ్రహ్మం, హెచ్‌వి.రోహిణి, సిహెచ్ఒ అరుణ, కృష్ణ, అనూష, ఆశాలు పాల్గొన్నారు.

బాల సదనం సందర్శన

ప్రజాశక్తి -భీమునిపట్నం : బాలసదనంను ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె రామలక్ష్మి శుక్రవారం సందర్శించారు. పిల్లలతో కాసేపు ముచ్చటించారు. తెలుగు , ఇంగ్లీష్ రైమ్స్ అడిగి, ఉత్సాహంగా సమాధానాలు చెప్పిన వారిని అభినందించారు పిల్లలకు .కాస్మోటిక్స్ అందించారు.బాల సదనం ప్రాంగణం, గ్రంథాలయం, స్టోర్, స్టాక్ రూమ్‌ను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. బాల సదనం ప్రాంగణంలో కూరగాయలు పెంచాలని సూపరింటెండెంట్ ఊర్మిళ కు సూచించారు. పెయింటింగ్, మరమ్మతు పనులను పరిశీలించారు. ఆవరణలో మొక్క నాటారు. సిడిపిఒ శ్రీదేవి ఉన్నారు.

కుమ్మర్ల స్థితిగతుల పరిశీలన

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని పాండ్రంగి గ్రామంలో కుమ్మర్ల జీవన స్థితిగతులను రాష్ట్ర కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ శుక్రవారం పరిశీలించారు గ్రామానికి చెందిన తాటిపూడి కృష్ణారావు అమరావతిలో చైర్మన్‌ను కలిసి 45ఏళ్లకే పెన్షన్, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరగా, ఆయన కోరిక మేరకు పాండ్రంగి కుమ్మర వీధిని సందర్శించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘం విశాఖ, విజయనగరం, పార్వతీపురం జిల్లాల అధ్యక్షులు వెంకటరమణ, కె.రమణ, బి వెంకట్ పాల్గొన్నారు.

సమస్యలపై వినతి

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో సుదీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలుగుదేశం సమన్వయకర్త సీతంరాజు సుధాకర్ కోరారు. శుక్రవారం కార్పొరేటర్లు ఉరుకుటి నారాయణరావు, విల్లూరి భాస్కర రావు, గొలగాని వీరరావు (బుజ్జి), గోడి పద్మావతి, కోడూరు అప్పలకొండమ్మలతో కలిసి జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ముఖ్యంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో మంచినీటి కుళాయి నీరు కలుషితమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొన్ని ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి సిసి కెమెరాలు ఏర్పాటుచేయాలని కోరారు.పోర్టు కాలుష్యం సమస్యను పరిష్కరించాలని కోరారు.

జ్వర పీడితులకు మెరుగైన వైద్యం

- సిహెచ్‌సి ఆకస్మిక సందర్శనలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

వైద్యసేవలపై రోగులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి -భీమునిపట్నం :జ్వరపీడితులకు మెరుగైన వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ సూచించారు. శుక్రవారం స్థానిక సిహెచ్‌సిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇన్, అవుట్ పేషెంట్లకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు.. డైట్‌పై ప్రశ్నించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వైరల్ ఫీవర్స్, డయేరియా పీడితులను ఒకేవార్డులో కాకుండా వేర్వేరుగా ఉంచి వైద్యసేవలు అందించాలని, తద్వారా ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశం ఉండదని వైద్యులకు సూచించారు. అదీ లేకుంటే కనీసం కర్టెన్ వేయాలన్నారు. విషజ్వరాలను సమర్థవంతంగా నియంత్రణకు అవి ఏయేప్రాంతాల నుంచి వస్తున్నాయో గుర్తించేందుకు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది తో నిత్యం అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. రక్తహీనత, బిపి, సుగర్ ఉన్న గర్భిణులను పిహెచ్‌సిలకు పంపకుండా ఇక్కడే మెరుగైన వైద్యం అందించాలని గైనకాలజిస్ట్ డాక్టర్ విజయశ్రీకి సూచించారు. ఆసుపత్రుల్లో సుఖ ప్రసవాలను ప్రోత్సాహించాలన్నారు.

సిహెచ్‌సిని 50 ,100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసిన తర్వాతే ఆర్థోపెడిక్, డెర్మటాలజీ, ఆప్తమాలజీ వంటి ప్రత్యేక సేవలు అందించే అవకాశం ఉంటుందని కలెక్టర్ సూచనకు డిసిహెచ్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ శంకర్‌ప్రసాద్ వివరించారు. అనంతరం మందుల నిల్వలను పరిశీలించారు. ఆసుపత్రిలో అవసరమైన మందులు, ల్యాబ్ పరికరాలను ఎన్టీఆర్ వైద్య సేవ నిధుల నుంచి కొనుగోలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం ఫణికుమార్, ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆకస్మికంగా సందర్శించారు.స్లాట్ విధానంలో సమస్యలున్నాయా అని సబ్ రిజిస్ట్రార్, సిబ్బందిని ప్రశ్నించారు. తహశీల్దార్ పైలా రామారావు, జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర, సబ్ రిజిస్ట్రార్ హర్ష వర్ధన్ ఉన్నారు

ఆన్‌లైన్‌లో ఆకాష్ టాలెంట్ హంట్

ప్రజాశక్తి- సీతమ్మధార : ఏఐ ఆధారిత సమగ్ర లెర్నింగ్ విధానం ద్వారా నీట్, జెఇఇలో టాప్ ర్యాంకులు సాధించాలనుకునే వారికి వందశాతం రాయితీపై శిక్షణకు ఆకాష్ నేషనల్ టాలెంట్ హంట్ 2025 పరీక్షను నిర్వహిస్తూ స్కాలర్‌షిప్, బహుమతులను ప్రకటిస్తున్నట్లు ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ స్టేట్ అకాడమిక్ హెడ్ ఆర్‌విఎస్ఎన్ మూర్తి, బిజినెస్ హెడ్ నిశాంత్ మిశ్రా తెలిపారు.

శుక్రవారం సంస్థ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 8వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు రూ.250కోట్ల విలువైన స్కాలర్‌షిప్‌లు అందజేత, ఇన్‌విక్టస్ కోర్సుల్లో చేరేందుకు ఈ అర్హత పరీక్ష ఈనెల 24, 31, వచ్చేనెల 7న ఆన్‌లైన్‌లో ఢిల్లీ బెంగళూరు చెన్నై అహ్మదాబాద్, విశాఖ వంటి ప్రముఖ నగరాల్లో తమకు ఉండే 415 సెంటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ఆంతి డాట్ ఆకాష్ డాట్ ఏసి డాట్ ఇన్ వెబ్‌సైట్ సంప్రదించాలన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో బ్రాంచి హెడ్ గుండు రాజేశ్వరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ వై లక్ష్మీనారాయణ, మేనేజర్లు సిబ్బంది మానస, సంతోష్ పాల్గొన్నారు.

గంభీరం పాఠశాల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- ఆనందపురం: మండలంలోని గంభీరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోశుక్రవారం మండల ప్రత్యేకాధికారి, సాంఘిక సంక్షేమ డిడి కె.రామారావు తనిఖీ చేశారు. పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు, భోజన నాణ్యతను పరిశీలించారు.. పాఠశాల మరుగుదొడ్ల పరిశుభ్రత, ఆర్ఒ వాటర్ ప్లాంట్ పనితీరు స్వయంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆటస్థలాన్ని మరింత అభివృద్ధి చేయాలని హెచ్ఎం యువివి. ప్రసాద్‌కు సూచించారు.ఎంఇఒ జోగేంద్రనాథ్ పాల్గొన్నారు.

కార్మిక నేత రామారావుకు ఘననివాళి

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక చిట్టి వలస లేబర్ యూనియన్ కార్యాలయంలో శుక్ర వారం ఏఐటియుసి నేత వి వి రామారావు నాలుగో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ పూల మాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థి ఉద్యమ నాయకుని నుంచి కార్మిక నాయకునిగా ఎదిగి, రామారావు చేసిన పోరాటాలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కొండపు ఈశ్వర రావు, కానూరు రాంబాబు, మోర అప్పలరాజు పాల్గొన్నారు

జెండర్ రిసోర్స్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా

జెండర్ కేంద్రంతో మహిళలకు భరోసా

ప్రజాశక్తి- ఆనందపురం: మహిళల రక్షణకు భరోసా కల్పించడానికి జెండర్ రిసోర్స్ కేంద్రం సేవలను అందుబాటులో తెచ్చినట్టు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు శుక్రవారం ఆనందపురం మహిళ మార్ట్‌లో జెండర్ సేవల కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ లింగాధారిత హింసను ఎదుర్కొంటున్న మహిళలకు, బాలికలకు తక్షణ సాయం, అవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన, భద్రత కల్పించడమే కాకుండా వైద్య సహాయం, పోలీసు ఫిర్యాదులకు మార్గదర్శనం వంటి సేవలు అందుతాయన్నారు. మానసిక ఆందోళనలో ఉన్న బాధితులకు కౌన్సిలింగ్, న్యాయ సలహాలు, తాత్కాలిక ఆశ్రయం అందుబాటులో ఉన్నాయన్నారు. బాధితుల్లో భరోసా, ధైర్యం, సామాజిక భద్రత పట్ల నమ్మకం పెంచేలా సేవలను మరింత విస్తృతం చేయనున్నట్లు వెల్లడించారు. డిఆర్‌డిఎ పీడీ బి.లక్ష్మీపతి, ఎంపిడిఒ డాక్టర్ జానకి, మాజీ జెడ్‌పిటిసి బమ్మిడి ఉమ, స్థానిక సర్పంచ్ లొడగల రాజేశ్వరి, రమణ, గండ్రెడ్డి సోంబాబు, టి.ఆదినారాయణ, బిఆర్‌వి నాయుడు,లొడగల రమణ, లొడగల వెంకట్రావు, కంచిబోయిన శ్రీను డిపిఎం వైదేహి, హెచ్‌డి రేణుక, ఎం ఎస్తేరు రాణి పాల్గొన్నారు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మండలంలోని తర్లువాడలో రూ.1.90 కోట్లతో రహదారులు, మంచినీటి కుళాయిల పనులకు ఎమ్మెల్యే గంటా శంకుస్థాపన చేశారు.. కొత్తగా మంజూరైన వితంతు పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సుపరిపాలన ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించారు. తర్లువాడ పంచాయతీలో రూ.80లక్షలతో 3 కిలోమీటర్ల బిటి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఎంపిపి డాక్టర్ మజ్జి శారదా ప్రియాంక, మజ్జి వెంకట్రావు ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో ఆర్‌డిఒకె. సంగీత్ మాధుర్, ఎంపిడిఒ జానకి, తహశీల్దార్ ఎస్. శ్రీనుబాబు, టిడిపి మండల అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, తర్లువాడ సర్పంచ్‌లు బిఆర్‌వి. నాయుడు, బలిరెడ్డి మల్లికార్జునరావు, కోరాడ వైకుంఠం, కురుమిన లీలావతి, గండ్రెడ్డి సోమినాయుడు, కె. శ్రీకాంత్ రాజు పాల్గొన్నారు

పది మంది మహిళలకు ఎగ్ కార్టులు పంపిణీ

ఆనందపురం మహిళా మార్ట్‌లో పదిమంది మహిళలకు ఎన్‌పిసిసి సంస్థ సహకారంతో పౌల్ట్రీ యాజమాన్యం భరిణికాన రామారావు ఉచితంగా అందించిన ఎగ్ కార్టులు (గుడ్ల వ్యాపార బడ్డీలు) ఎమ్మెల్యే గంటా పంపిణీ చేశారు. ఒక్కొక్కటి రూ.50వేల విలువైన ఈ బడ్డీలో గుడ్ల వ్యాపారం చేసి ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి, అనకాపల్లి రూరల్ : అనకాపల్లి కొత్తూరు జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... గొలుగొండ మండలానికి చెందిన బాలాజీ (24), మునగపాక మండలానికి చెందిన మేడిశెట్టి వెంకట సూర్యప్రారావు (29), గాజువాకకు చెందిన సైనా రవి ముగ్గురు స్నేహితులు. ఒక కంపెనీలో పని చేస్తున్నారు. వీరు అనకాపల్లి మండలం కొత్తూరులో నివాసముంటున్నారు. శుక్రవారం తెల్లవారుజామున ముగ్గురు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా జాతీయ రహదారిపై వెనుక ఉండి వచ్చిన వ్యాన్ వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలాజీ (24), వెంకట సూర్యప్రారావు అక్కడికక్కడే మృతి చెందారు. సైనా రవి తీవ్రంగా గాయపడగా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ట్రాఫిక్ సిఐ వెంకట నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- సీతమ్మధార : విద్యుత్ షాక్ తో వాటర్ సర్వీసింగ్ బాయ్ మృతి చెందిన ఘటన ఐటిఐ జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది.కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలివి. స్థానిక సిద్దార్థ నగర్ ప్రాంతానికి చెందిన బీమరతి రమణ (41) ఐటీఐ జంక్షన్ వద్ద కుంచుమాంబ వాటర్ వాష్ సర్వీసింగ్ సెంటర్‌లో సర్వీసింగ్ బాయ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో వాటర్ వాష్ చేస్తుండగా, ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డాడు. స్థానికులు కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదుచేయగా, సిఐ కె రవికుమార్, ఎస్ ఐ రవికుమార్ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్ట్‌మార్టానికి కెజిహెచ్‌కు తరలించారు. మృతునికి భార్య సత్యవతి, కుమారుడు జశ్వంత్ ఉన్నారు. హెచ్‌సి శ్రీధర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృత్యువాత

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని బంటుపల్లి కల్లాలకు చెందిన మదపాక అచ్చిబాబు (35) అనే వ్యక్తి పురుగుమందు తాగి మృతిచెందాడు. వివరాలివి. గతనెల 29న మద్యం తాగి ఇంటికొచ్చిన అచ్చిబాబును అతని భార్య, బంధువులు మందలించడంతో మనస్తాపానికి గురై, ఇంటి పక్కనే ఉన్న పొదల్లోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడిపోయిన అచ్చిబాబును కుటుంబ సభ్యులు గుర్తించి విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 6 గంటలకు మృతి చెందాడు.. భార్య భవానిచ్చిన ఫిర్యాదు మేరకు ఆనందపురం సీఐ చింత వాసునాయుడు ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ బి. శ్రీనివాస్ దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - ఆరిలోవ : జోడుగుళ్లపాలెం బీచ్‌లో వద్ద శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకు వచ్చినట్టు ఆరిలోవ శాంతి భద్రతల ఎస్ఐ వై.కృష్ణ తెలిపారు. మృతుని చేతిపై జగదీష్ అని, పొట్టపై అమ్మ అని పచ్చబొట్టు రాసి ఉన్నట్టు తెలిపారు.. మృతుని వివరాలు తెలియాల్సి ఉందన్నారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి కెజిహెచ్ మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్ఐ కృష్ణ తెలిపారు

స్కూలు ఎడ్యుకేషన్ సెక్రటరీలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - ఆరిలోవ : జిల్లాలో ప్రభుత్వ జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తున్న పాఠశాల సహాయకులు 2025 -26, 2026-27 విద్యా సంవత్సరానికి గాను అండర్ 14, 17, 19 స్కూలు ఎడ్యుకేషన్ సెక్రటరీ(ఎస్‌జిఎఫ్) కొరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 5లోగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవచ్చున్నారు.

3న వైసిపి సమావేశం

ప్రజాశక్తి -పద్మనాభం.:మండలంలోని మద్ది గ్రామంలో ఈనెల 3న ఆదివారం ఉదయం వైసిపి విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిపి కంటుబోతు రాంబాబు తెలిపారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు పిలుపుమేరకు వైసిపి శ్రేణులు పాల్గొనాలని కోరారు.

రీ సర్వేతో భూఆక్రమణలకు చెక్

గ్రామసభలో మాట్లాడుతున్న సర్వే జాయింట్ కమిషనర్

ప్రజాశక్తి -పద్మనాభం: . రీ సర్వేతో భూఆక్రమణలకు ఆస్కారం ఉండదనిస్పెషల్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ జాయింట్ కమిషనర్ ఆర్ గోవిందరావు అన్నారు.శుక్రవారం మండలంలోని గంధవరంలో రీసర్వేను తహశీల్దార్ కె.ఆనందరావు ఆధ్వర్యంలో పరిశీలించారు గ్రామ సచివాలయం ప్రాంగణంలో రైతులతో గ్రామసభలో మాట్లాడుతూ, గంధవరంలో ఎనిమిది బ్లాక్‌లుగా చేస్తున్న రీసర్వేలో ఐదు బ్లాకులు పూర్తయ్యాయని తమశీల్దార్ వివరించగా, మిగతా బ్లాక్‌ల్లోనూ పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామానికి చెందిన సోమి నాయుడు, గుప్తాజీ, డి రాఘవ, రామరాజు, ఎస్ సత్యమూర్తి తదితర రైతులు పలు సమస్యలను విన్నవించగా, వాటికి పరిష్కార చర్యలు సూచించారు. కార్యక్రమంలో ఎంపిటిసి రమణరాజు, సర్పంచ్ జివివికె వర్మ, గంధవరం పిఏసిఎస్ చైర్ పర్సన్‌జె.గణేష్ పాల్గొన్నారు.

నిబంధనల ఉల్లంఘనపై చర్యలు చేపట్టండి

గంటా నూకరాజు

ప్రజాశక్తి -భీమునిపట్నం : తీర ప్రాంతంలో సిఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి శాశ్వత కట్టడాలు నిర్మించి బార్లు, రెస్టారెంట్లు యథేచ్ఛగా నిర్వహిస్తున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని జివిఎంసి మూడో వార్డు ఎగువ పేట గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షులు గంటా నూకరాజు కోరారు. శుక్ర వారం భీమిలిలో విలేకర్లతో మాట్లాడుతూ, పర్యావరణ, ఇతర అనుమతులేవీ లేకుండా బార్లు, రెస్టారెంట్లు నిర్వహిస్తున్నా బాధ్యులపై చర్యలకు అధికారులు ఎందుకు వెనుకడుతున్నారని ప్రశ్నించారు. న్యాయస్థానాలను సైతం తప్పుదోవ పట్టించేలా అధికారుల చర్యలు దుర్మార్గమన్నారు. సముద్రం కోత, కాలుష్యానికి కారణమైన బార్ అండ్ రెస్టారెంట్ల యజమానులపై చర్యలు తీసుకోవాలని, శాశ్వత కట్టడాలను తొలగించాలని కోరారు.

రూ.76.33 కోట్లతో మాస్టర్ ప్లాన్ రోడ్డు

ప్రజాశక్తి-పెందుర్తి: నియోజవర్గంలో రూ. 76.33 కోట్లతో మాస్టర్ ప్లాన్ రోడ్ల విస్తరణ చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు తెలిపారు. శుక్రవారం సుజాతనగర్ క్యాంపు కార్యాలయంలో పార్టీ కేడర్, కూటమి నేతలతో నిర్వహించిన సమావేశంలో పంచకర్ల మాట్లాడుతూ, ఈనెల3న మాస్టర్ ప్లాన్ రోడ్డు శంకుస్థాపనతోపాటు జివిఎంసి 95వ వార్డు చీమలపల్లి విఎంఆండిఎ కన్వెన్షన్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు శరవేగంగా సాగుతున్నాయన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. 3న అభివృద్ధి కార్యక్రమాల్లో కూటమి కేడర్ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.కార్యక్రమంలో మండల, వార్డుల పార్టీ అధ్యక్షుడు, నేతలు పాల్గొన్నారు.

పేటెంట్ ఫైలింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి- వేపగుంట : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో 'ఫ్యూయలింగ్ ఇండియా, ఇన్నోవేషన్ ఇంజిన్' అంశంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు.కార్యక్రమంలో నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఆర్‌డిసి) డిప్యూటీ మేనేజర్, పేటెంట్ ఏజెంట్ ప్రీతి నిహారిక మాట్లాడుతూ, విద్యార్థుల ఇన్నోవేటివ్ ఆలోచనలను ప్రాజెక్టుల రూపంలో అభివృద్ధి చేసి, పేటెంట్ ఫైలింగ్ విధానం ద్వారా ఎలా పబ్లిష్ చేయాలో వివరించారు. అలాగే స్టార్టప్‌లను ప్రారంభించడానికి అవసరమైన ప్రాథమిక దశలు, వ్యాపార ప్రణాళిక సిద్ధం చేయడం, మార్కెటింగ్ వ్యూహాలు వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జి. సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ జివి.ప్రదీప్ వర్మ, ఇఐఎస్‌ఐ కోఆర్డినేటర్ చందన, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేతన బకాయి చెల్లించాలని ధర్నా

సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న క్లాప్ కార్మికులు

ప్రజాశక్తి-మధురవాడ : క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) లోడర్స్, సూపర్వైజర్లకు ఏడాదికి పైగా బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జివిఎంసి రెండో జోనల్ కార్యాలయం వద్ద ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు.. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు డి.అప్పలరాజు, పి.రాజుకుమార్ మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ పద్ధతిన జాయినైతే, తర్వాత కనీస వేతనం అమలు, ఉద్యోగం రెగ్యులరైజేషన్ చేస్తామని నమ్మబలికి ఒక్కొక్కరి నుంచి రూ.మూడు లక్షల డిపాజిట్ కట్టించుకుని క్లాప్ కార్మికులను నియమించారన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ డబ్బులు వీరి జీతాల నుంచి కట్ చేస్తున్నా సంబంధిత ఖాతాలకు జమ చేయడం లేదన్నారు. దీనిపై కాంట్రాక్టర్‌ను అడుగుదామంటే కనీసం ఫోనులోనూ దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి, ఏడాది బకాయి వేతనంతోపాటు ఇతర సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు జెడ్సీ కనకమహాలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కమిషనర్ దృష్టికి తీసుకెళతానని జెడ్‌సి హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎన్ స్వామి, టి.భరణికుమార్, కె.వినీత్, డి.రాంబాబు, వై జీవంకుమార్ పాల్గొన్నారు.

హయ్యర్ పెన్షన్ కోసం
ఇపిఎస్ పెన్షనర్ల ఆందోళన

భెల్ గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఇపిఎస్ పెన్షనర్లు, కార్మికులు

ప్రజాశక్తి -గాజువాక : ఇపిఎస్ 95 పెన్షనర్లకు హయ్యర్ పెన్షన్ అమలుకు ఈనెల 2న భెల్ అంబేద్కర్ విగ్రహం వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు సిఐటియు ప్రధాన కార్యదర్శి జిటిపి ప్రకాష్ అన్నారు. శుక్రవారం హయ్యర్ పెన్షన్ పొందేందుకు పెన్షనర్ల డేటాఫ్ జాయినింగ్ సరిచేయాలని కోరుతూ భెల్ గేటు వద్ద ప్రోగ్రెసివ్ ఫ్రెంట్ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు ప్రధాన కార్యదర్శి జిటిపి ప్రకాష్ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఇపిఎస్ 95 పెన్షనర్లకు హయ్యర్ పెన్షన్ అమలు చేయవలసిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. దీనికోసం ఉద్యోగుల జాయినింగ్స్ తేదీలను సరిచేయాలన్నారు. ఈ విషయంలో యాజమాన్యం కావాలనే కాలయాపన చేస్తూ పెన్షనర్లకు అన్యాయం చేస్తోందన్నారు. భెల్ హైదరాబాదు యూనిట్‌లో అమలు జరిగిన హయ్యర్ పెన్షన్, విశాఖ భెల్ యూనిట్‌లో విశ్రాంత ఉద్యోగులకు వర్తించకపోవడానికి యాజమాన్య నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. ఐఎన్‌టియుసి నాయకులు సీతన్న నాయుడు మాట్లాడుతూ వివిధ సిరీస్‌ల్లో ఉద్యోగుల డేట్ అఫ్ జాయినింగ్స్ సరిగా లేనందున, చాలామంది హయ్యర్ పెన్షన్ అందక బాధపడుతున్నారని.ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో గుర్తింపు సంఘంగా ఉన్నప్పుడు కొందరి సమస్యలను పరిష్కరించామని, కానీ ఇప్పుడు యాజమాన్యం, గుర్తింపు యూనియన్ నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తుందన్నారు సిఐటియు నాయకులు ఎస్. జ్యోతిశ్వరరావు అధ్యక్షతన జరిగిన నిరసనలో వి ఆనందరావు కె విజయ్‌కుమార్, మురళీశ్వరరావు, బి కృష్ణ మూర్తి, డి.నరసింహారావు, డి.చిట్టిబాబు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులను
తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న జ్యోతీశ్వరరావు, రాంబాబు

ప్రజాశక్తి - గాజువాక : విశాఖ స్టీల్ ప్లాంట్ లో తొలగించిన ఐదు వేల మంది కాంటాక్ట్ కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని విశాఖ పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్ జ్యోతిశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం గాజువాక సిఐటియు కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైజాగ్ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్ కుట్రపూరితంగా కాంట్రాక్టు కార్మికులపై వేటు వేసి రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రధాని మోడీకి ఈమెయిల్ ద్వారా వినతి పంపామని, ప్రభుత్వరంగ సంస్థల వద్ద నిరసన చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఎన్నికలకు ముందు విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని ఇచ్చిన మాటతో కాంట్రాక్టు కార్మికులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్ విజయంలో భాగమయ్యారని, ఇపుడు వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత వీరిపైనే ఉందన్నారు.. నిర్వాసితులందరికీ ఉపాధి కల్పించి, తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు.. సిఐటియు నాయకులు ఎం రాంబాబు మాట్లాడుతూ, తొలగించిన కార్మికులందరూ ఉత్తరాంధ్రకు చెందిన వారేనని, కేవలం నిర్వాసితులకే న్యాయం చేస్తానని, మిగతా కార్మికులను పట్టించుకోనని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చెప్పడం భావ్యం కాదన్నారు. సమావేశంలో నమ్మి రమణ, డి వెంకట్రావు, డి రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఔషధ వినియోగంలో అప్రమత్తత
గీతం సదస్సులో డిసిఎ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్

ప్రజాశక్తి-మధురవాడ : ప్రజారోగ్య సంరక్షణలో ఔషధాల పాత్ర కీలకమని రాష్ట్ర ప్రభుత్వ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డిసిఎ) సహాయ డైరెక్టర్ ఎస్.విజయ్ కుమార్ అన్నారు నిషేధిత ఔషధాలను, అవసరం లేకపోయిన యాంటీబయాటిక్‌ల వాడటం వల్ల ఎదురయ్యే దుష్పరిణామాలను ప్రజలకు తెలియ జేయాల్సిన బాధ్యత ఫార్మసిస్టులపై ఉందన్నారు శుక్రవారం డాక్టర్ జి.సౌజన్య సంధాన కర్తగా గీతం ఫార్మసీ విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సుల ోమాట్లాడుతూ, సహజ సిద్ధమైన ఔషధ వినియోగం నుంచి సింథటిక్ ఔషధాల వినియోగం ఎలా అభివృద్ధి చెందిందో వివరించారు. వైరల్ ఇన్‌ఫెక్షన్‌లకు యాంటీ బయాటిక్‌ల వాడకం ప్రమాదకరమని, శరీరంలోని రోగనిరోధక శక్తి తగ్గి పోతుందన్నారు. ఫార్మసిస్టులు నైతిక బాధ్యతగా ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా ఔషధాలను అందించాలన్నారు. డిసిఎ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ కృత్రిమ మేధ ఫార్మసీ, వైద్య ఆరోగ్య రంగంలో పెను మార్పులపై అవగాహన అవసరమన్నారు.గీతంలో ఫార్మసీ పరిశోధనలనుఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్ వివరించారు.

అప్పన్న సన్నిధిలో గుజరాత్ హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి- వేపగుంట :సింహాద్రి అప్పన్నను గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సిహెచ్. మానవేంద్రనాథ్ రాయ్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఎఇఒ కె. తిరుమలేశ్వరరావు, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, పిఆర్ఒ నాయుడు సాదరంగా స్వాగతించారు. కప్పస్తంభాన్ని ఆలింగనం, బేడా మండపంలో ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో స్వామిని దర్శించుకున్నారు. వేదపండితులు ఆశీర్వచనం అందించగా, ఎఇఒ తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణాధికారి బి.శ్రీనివాస్ స్వామి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదాన్ని బహూకరించారు.

ఎట్టకేలకు 12వ వార్డులో రేషన్ డిపో

రేషన్ డిపో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు లీలా సుందరయ్యనగర్, నెహ్రూనగర్, దుర్గానగర్ ప్రజలకు అందుబాటులో ఉండేలా నెహ్రూనగర్‌లో రేషన్ డిపోను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శుక్రవారం ప్రారంభించారు. రేషన్ సరుకులకు వేరే వార్డుల్లోని డిపోకు వెళ్లేందుకు స్థానికులు పడుతున్న ఇబ్బందులపై టిడిపి పార్లమెంటు కమిటీ కార్యదర్శి వేడువాక సన్యాసిరావు ఇచ్చిన ఫిర్యాదు, ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి ఎమ్మెల్యే వెలగపూడి స్పందించి 11వ వార్డులో ఉన్న 221 రేషన్ డిపోను ఎట్టకేలకు 12వ వార్డులో ఏర్పాటు చేయించారు.కార్యక్రమంలో టిడిపి నాయకులు గాడ సత్యం, విశాఖ పార్లమెంటు కమిటీ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు, ఉపాధ్యక్షులు కొత్తల గోపాల్, నెహ్రూ నగర్ సంఘం అధ్యక్షులు శీరెడ్డి అప్పారావు, బసవ దేవుళ్ళు, తిమోతి, బండారు శంకర్రావు, ఇళ్ళ లక్ష్మీ పాల్గొన్నారు.

హైస్పీడ్ ఇంటర్నెట్‌తో డిజిటల్ బోధన

డిజిటల్ పరికరాలను పరిశీలిస్తున్న డిఇఒ

ప్రజాశక్తి -మధురవాడ : జిల్లా వ్యాప్తంగా 578 ప్రభుత్వ పాఠశాలల్లో హైస్పీడ్ ఇంటర్నెట్‌తో ఆన్‌లైన్ డిజిటల్ బోధనకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందని డిఇఒ ఎన్ ప్రేమకుమార్ తెలిపారు. డిజిటల్ తరగతుల బోధనకు అవసరమైన ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్స్(ఐఎఫ్‌పి), స్మార్ట్ తెరలు, 5జీ ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 127 జివిఎంసి పాఠశాలలకు బిఎస్ఎన్ఎల్ 5జీ ఇంటర్నెట్‌సదుపాయాన్ని కల్పించగా, శుక్రవారం చంద్రంపాలెం ఉన్నత పాఠశాల వేదికగా జిల్లాలో అన్ని మండలాల్లోని 451 పాఠశాలలకు రూటర్సుకు జియో, వొడా సంస్థల న 5జీ అంతర్జాల సదుపాయాన్ని కల్పించారు. ఈ ప్రక్రియను డిఇఒ ఎన్. ప్రేమకుమార్, విద్యాశాఖ ఐటీ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ వేణుగోపాల్, సూపరింటెండెంట్ రామకృష్ణ రమేష్‌మార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డిఇఒ ప్రేమకుమార్ మాట్లాడుతూ కొన్ని పాఠశాలల్లో 4జి ఇంటర్నెట్, ఐఎఫ్‌పి స్మార్ట్‌తెరలపై బోధనకు సాంకేతిక సమస్యలు ఉత్పన్నమౌతున్న పరిస్థితుల్లో 5జి నెట్‌వర్క్‌తో బ్రాడ్‌బ్యాండ్‌లను అందిస్తామన్నారు. ఎంఇఒ రవీంద్రబాబు, హెచ్‌ఎం ఎం. వెంకటరావు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు 8లోగా దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ నెల 8 లోపు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి దరఖాస్తులు పంపించాలని తెలిపారు

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు నిధులు ఖర్చు చేయాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు

ప్రజాశక్తి-రాంబిల్లి

భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను భనవ నిర్మాణ కార్మికులకు ఖర్చు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. మండలంలోని పెద కలవలపల్లిలో శ్రీదుర్గాంబిక భవన నిర్మాణ కార్మిక సంఘం, శ్రీకొత్తమ్మ తల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశాలలు శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 13 నెలలు కావస్తున్నా ఎన్నికల మేనిఫెస్టోలో భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని తెలిపారు. పెండింగ్ క్లైములు చెల్లించాలని, అందరికీ పూర్తిస్థాయిలో పనులు కల్పించాలని కోరారు. సంక్షేమ బోర్డు నిధులు, బిల్డింగ్ సెస్ ద్వారా వసూలు చేసిన డబ్బులు భవన నిర్మాణ కార్మికులకు ఖర్చు చేయకుండా ప్రచార ఆర్భాటాలకు, దారి మళ్లింపు చేస్తుందని విమర్శించారు. ఈనెల 5న రాంబిల్లిలో అనకాపల్లి జిల్లా భవన నిర్మాణ సంఘం మహాసభలు జరుగుతాయని, ఇందులో భవన నిర్మాణ కార్మికుల సమస్యల గురించి చర్చించి, ఒక కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేవుడు నాయుడు, మండల కన్వీనర్ చందక రామకృష్ణ, భవన నిర్మాణ సంఘం అధ్యక్షులు సీరం రాంబాబు, రాము, నాగేంద్ర, అప్పలరాజు, గణేష్, అధిక సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

సబ్బవరం : మండల కేంద్రంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో శుక్రవారం సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నిధులను కార్మికులకు ప్రమాదాల జరిగినప్పుడు వెంటనే పరిహారం కింద చెల్లించాలని కోరారు. ప్రసవం, పెళ్లిళ్ల సమయంలో చెల్లించవలసిన ఆర్థిక సహాయం ప్రభుత్వం నిలుపుదల చేయడం దారుణమన్నారు. సంక్షేమ బోర్డు నిధులకు ప్రభుత్వాలు తన అవసరాల కోసం వాడుకోవడం చట్ట విరుద్ధమన్నారు. ఈ నెల 5న జరుగు భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘ నేతలు పూడి అప్పలనాయుడు, గొంప ముత్యాలు, గొంతిన అప్పారావు(చంటి), వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి వరలక్ష్మి

మహిళా కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-కశింకోట : వివిధ ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి డిడి.వరలక్ష్మి డిమాండ్ చేశారు. కశింకోటలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళా కార్మికులకు కనీస వేతనాలు అమలు కాక, ఇచ్చే అరకొర జీతాలు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగినా అందుకు అనుగుణంగా జీతాలు పెరగకపోవడంతో దుర్భర జీవనం సాగిస్తున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మిడ్డేమీల్స్ కార్మికులకు రూ.3వేలు మాత్రమే గౌరవ వేతనం ఇస్తుందని, స్కూల్ ఆయాలకు రూ.6 వేలు చెల్లిస్తున్నారని, జీతాలతో ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మహిళా కార్మికుల సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. నాగమణి, శివలక్ష్మి, నూకరత్నం, వరలమ్మ పాల్గొన్నారు.

తారురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-రాంబిల్లి : మండలంలోని అప్పారాయుడుపాలెం రాజకోడూరు, పంచదార్ల వరకు తారురోడ్డు నిర్మాణాన్కిఇ స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, అధికారులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆటలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి-కశింకోట : ఆటలు మానసిక ఉల్లాసం ఇస్తాయని కశింకోట డిపిఎన్ హైస్కూల్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ప్రసాదరావు అన్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ఆటలు పోటీలను శుక్రవారం ప్రారంభమయ్యాయి. బాలికల స్కిప్పింగ్ పోటీలను ఆయన డ్రమ్స్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ చదువుతో పాటు ఆటల్లోనూ విద్యార్థులు రాణించాలని కోరారు. కార్యక్రమంలో పీడీలు కమల, ప్రభాకర్‌రావు, పాల్గొన్నారు.

ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ప్రసాదరావు

కానిస్టేబుల్ ఫలితాల్లో చంద్రశేఖర్‌కు 19వ ర్యాంకు

ప్రజాశక్తి-చోడవరం : శుక్రవారం వెలువడిన కానిస్టేబుల్ ఫలితాలలో చోడవరం గ్రామానికి చెందిన నామాల చంద్రశేఖర్ ఉమ్మడి విశాఖ జిల్లాలో 19వ ర్యాంక్ సాధించాడు. 200 మార్కులకు గాను 143 వచ్చాయి. సివిల్ కానిస్టేబుల్‌గా సెలక్ట్ అయ్యాడు. తండ్రి నేమాల నరసింగరావు పెయింటర్. చంద్రశేఖర్ గతంలో చోడవరంలో గ్రామ వాలంటీర్‌గా పని చేశారు. పేద కుటుంబం నుండి వచ్చిన చంద్రశేఖర్ ఎంబిఎ చదివాడు. ప్రభుత్వ అధికారిగా కొలువు సాధించాలన్నది తన ధ్యేయమని ఈ సందర్భంగా చంద్రశేఖర్ తెలిపారు.

ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని తెనుగుపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు నేషనల్ మీన్స్-కమ్-మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. సిరి ఫౌండేషన్ సభ్యులు ఎస్.బాబూరావు, ఎల్‌వి.నారాయణరావు సమన్వయంతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం డిఎస్ఎస్‌వి.ప్రసాద్, ఉపాధ్యాయులు పెద్దాడ వెంకటరమణ, శ్రీనివాసరావు, మహేశ్వరరావు, మాధవరావు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మెటీరియల్ అందజేసిన దృశ్యం

ఆటో కార్మికులను ఆదుకోవాలని ఆందోళన

ఆందోళన చేస్తున్న ఆటో కార్మికులు

ప్రజాశక్తి-బుచ్చయ్య పేట : రాష్ట్ర ప్రభుత్వం "మహిళలకు ఫ్రీ బస్సు" వల్ల నష్టపోతున్న ఆటో, రవాణా కార్మికులను ఆదుకోవాలని కోరుతూ బుచ్చియ్యపేట మండలం రాజాం ఆటో కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సు పథకం ప్రవేశ పెట్టడం ద్వారా ఆటో కార్మికుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోందని తెలిపారు. అందువల్ల ఆటో కార్మికులకు ఏడాదికి తగిన రీతిలో ప్రభుత్వ సహాయం చేయాలని, ప్రభుత్వమే వడ్డీ లేని రుణాలు అందించాలని, ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కోశాధికారి జి.నాయన బాబు, ఎస్‌వి నాయుడు, రాజాం, నీలకంఠాపురం ఆటో స్టాండ్ యూనియన్ నాయకులు పడాల వెంకటరమణ, అభి, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

పశుపోషకుల అభివృద్ధికి సర్వే

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలాల్లో పశుపోషకుల ఆర్థిక స్థితిగతులపై సమగ్ర సమాచారం సేకరించే ఉద్దేశ్యంతో "బ్లాంకెట్ సర్వే" చేపట్టినట్లు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఇ.దినేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం వారాడ, వి.సంతపాలెం గ్రామాల్లో ఆయన పర్యటించి బ్లాంకెట్ సర్వే జరుగుతున్న తీరుని పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ పట్టణ ప్రాంతాలలోని పశుపోషకుల అవసరాలు, ఆదాయ వనరులు, పశువుల వివరాలు తదితర అంశాలపై సుమారు 35 ప్రశ్నల ఆధారంగా ఈ సర్వే జరుపుతున్నామని తెలిపారు. పశుపోషకులు ఈ సర్వేలో అవసరమైన సమాచారాన్ని అందించాలని కోరారు. ఈ సర్వేలో వారాడ, వి.సంతపాలెం పశువైద్య సహాయకులు సుధారాణి, మంగ పాల్గొన్నారు.


పశుసోషకుల సర్వే చేస్తున్న దృశ్యం

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని వంగలిలో ఏర్పాటు చేసిన ఇండియన్ మారిటైం యూనివర్సిటీకి భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయాలని వంగలి గ్రామ సర్పంచ్ ఆకుల శ్రీహేమ గణేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నిర్వాసిత రైతులు శుక్రవారం నిరసన తెలియజేసి ఇండియన్ మారిటైం యూనివర్సిటీ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆకుల గణేష్ మాట్లాడుతూ ఇండియన్ మారిటైం యూనివర్సిటీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న ఇతర ప్రాంతాల వారిని తొలగించాలని, యూనివర్సిటీకి భూములు ఇచ్చిన రైతులకు ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటే వంగలి రైతులు తమ న్యాయపోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు గొర్లి అప్పలనాయుడు, జెట్టి ప్రసాద్, గవర శ్రీను, జెట్టి ముత్యాల నాయుడు, జెట్టి హేమంత్, ఎర్ర సతీష్ కంద రాము, బలిరెడ్డి అప్పలరాజు, జెట్టి సోమేష్, గవర అప్పలనాయుడు, బలిరెడ్డి శివ, జి.ఈశ్వరరావు, వి.నూకరాజు పాల్గొన్నారు.

మారిటైం వర్సిటీ ఎదుట నిరసన తెలుపుతున్న వంగలి గ్రామస్తులు

పిఎసిఎస్ పదవుల కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

జిల్లాలోని పలు మండలాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఎసిఎస్) పర్సన్ ఇన్‌ఛార్జులు, డైరెక్టర్ల పదవుల నియామకం జరిగినప్పటికీ బుచ్చయ్యపేట మండలంలో ఆ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో ఆ పదవుల కోసం ఆశావహులు ఆశావాలు ఎదురుచూస్తున్నారు. టిడిపి, జనసేన, బీజేపీ కూటమి పార్టీల మధ్య పదవులు పంపకాలు జరగాల్సి ఉండగా, వాటి మధ్య సమస్య ఒక కొలిక్కి రాలేదు. ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా పిఎసిఎస్ పర్సన్ ఇన్‌ఛార్జులు నియామకాలు పూర్తయినప్పటికీ, బుచ్చయ్యపేట మండలంలో ఎంపిక ప్రక్రియ పూర్తి కాలేదు. మండలంలోని బుచ్చయ్యపేట, విజయరామరాజుపేట, వడ్డాది, బంగారుమెట్ట, పొట్టి దొరపాలెం, తురకలపూడి మొత్తం ఆరు పిఎసిఎస్‌లు ఉన్నాయి. ఇందులో ఒక సొసైటీని జనసేన పార్టీకి కేటాయించారు. ఆ ఒక్క సొసైటీ ఎక్కడ ఇవ్వాలి అనేది ఇప్పటి వరకు స్పష్టత రాలేదు. విజయరామరాజుపేట, బుచ్చయ్యపేట, వడ్డాది సొసైటీల్లో ఏదో ఒకటి జనసేనకు కేటాయించే అవకాశాలు వున్నాయి. జనసేన మండల అధ్యక్షుడు డిఎస్ నాయుడు, టిడిపి నుంచి మాజీ సర్పంచ్ డొంకిన అప్పలనాయుడు బుచ్చయ్యపేట సొసైటీ కోసం పట్టుబడుతున్నారు. వడ్డాది కోసం టిడిపి నుంచి టౌన్ అధ్యక్షుడు దొండా నరేష్, దొండా గిరిబాబు, జనసేన నుంచి దొండా సన్యాసిరావు పోటీ పడుతున్నారు. విజయరామరాజు పేట కోసం టీడీపీ నుండి మాజీ సర్పంచ్ దొడ్డి కిషోర్, జనసేన నుండి సీడీసీ మాజీ చైర్మన్ కర్రి తమ్మునాయుడు ప్రయత్నాలు చేస్తున్నారు. జనసేనకు కేటాయించే సీటు పైనే అందరికీ ఆసక్తి నెలకొంది. వడ్డాది పిఎసిఎస్ కోసం పోటీ తీవ్రంగా ఉంది. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు మేనల్లుడు నరేష్, బావమరిది గిరిబాబు టిడిపి నుంచి పదవి కోసం ఎదురుచూస్తున్నారు. బంగారమెట్ట, పొట్టిదొరపాలెం, తురకలపూడి పిఎసిఎస్‌లకు అభ్యర్థులను ఎంపిక పూర్తి చేశారు. అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది.

వడ్డాది పిఎసిఎస్ భవనం

స్వాతంత్ర్య దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం వివిధ శాఖల జిల్లా అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది వలె స్థానిక ఎన్టీఆర్ మైదానంలో వేడుకలు నిర్వహించాలని సూచించారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను వేడుకలకు ఆహ్వానించి సత్కరించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతంగా నిర్వహించాలన్నారు. అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. వేడుకలకు హాజరయ్యే అధికారులకు, అతిథులకు, ప్రజాప్రతినిధులకు విద్యార్థులకు తాగు నీటి సౌకర్యం కల్పించాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలపై స్టాల్సు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలపై వివిధ శాఖల సంబంధించిన శకటాల ప్రదర్శన చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ వై.సత్యనారాయణరావు, జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్) ఎల్.మోహనరావు, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓలు షేక్ ఆయిషా, వివి రమణ, డిఇఒ గిడ్డి అప్పారావు నాయుడు, జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి వినోద్ బాబు, జిల్లా అగ్ని మాపక, రవాణా శాఖ అధికారులు వెంకటరమణ, మనోహర్, డిపిఒ సందీప్, డిఎంహెచ్ఒ హైమావతి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి మోహన్ రావు, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి వి. సుధీర్, డ్వామా, డిఆర్డిఏ, గృహ నిర్మాణ శాఖ పీడీలు పూర్ణిమాదేవి, శచీదేవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న టిడిపి నేత కన్నూరు వెంకటరమణ తదితరులు

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-పరవాడ : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని మడకపాలెం గ్రామంలో శుక్రవారం టిడిపి నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు కన్నూరు వెంకటరమణ, యూనిట్ కన్వీనర్ వర్రి వసంతరావు, యూనిట్ కన్వీనర్ గంట్ల శ్రీనివాసరావు, బూత్ కన్వీనర్ మడక లతారాము తదితరులు ప్రజలకు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాయవరపు దేవుడు, బూత్ కన్వీనర్ గొంతిన శ్రీనివాసరావు, నాయకులు బండారు షణ్ముఖరావు, బండారు సన్యాసిరావు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి-కశింకోట : చిరు వ్యాపారాలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. ఇందులో భాగంగా కశింకోటలోని డ్వాక్రా మహిళా సభ్యురాలు బుద్ధ లక్ష్మికి రూ.50 వేలు విలువైన ఎగ్ కార్డును శుక్రవారం అందజేశారు. 2025-26 ఏడాదికి రాష్ట్రవ్యాప్తంగా 1,000 మందికి ఎగ్ కార్డులను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీ సుభాషిణి, డిప్యూటీ ఎంపీడీవో తోటరావు, ఏపీఎం నడిపూడి పార్వతి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్లపాలెం పంచాయతీ బంగారయ్యపేట గ్రామంలో మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు విస్తరిస్తున్న నేపథ్యంలో శుక్రవారం స్పెషల్ శానిటైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గల్లా రాజు, పంచాయితీ ఈవో సత్యప్రసాద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

'నా సాగు భూమిని వేరొకరికి ఎలా కేటాయిస్తారు'

మాట్లాడుతున్న అప్పలనరసమ్మ

ప్రజాశక్తి-సబ్బవరం : తమ సాగు భూమిని వేరొకరికి ఎలా కేటాయిస్తారని మండలంలోని పైడివాడ అగ్రహారం గ్రామానికి చెందిన బొబ్బరి అప్పల నరసమ్మ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పలనరసమ్మ శుక్రవారం స్థానిక విలేకర్లకు తన గోడు వెల్లబుచ్చుకుంది. పైడివాడ అగ్రహారం రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 126/2లో 60 సెంట్లు భూమి ఉందని, అందులో తన భర్త బొబ్బరి రామునాయుడు పేరిట రెవెన్యూ రికార్డులలో 31.5 సెంట్లు నమోదై ఉందని పేర్కొన్నారు. అలాగే 29 సెంట్లు అనుభవంలో ఉందన్నారు. ఆ భూమిని తాను ల్యాండ్ పూలింగ్ కింద ప్రభుత్వానికి ఇవ్వడంగాని, ఎటువంటి రాతపూర్వక అనుమతి పత్రం ఇవ్వడంగాని చేయలేదని తెలిపింది. అయితే ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్‌లో భూమి కోల్పోయిన వేరే వ్యక్తి భగవతి అప్పారావు భార్య భగవతి సత్యవతికి ప్లాట్ నెంబర్ 116గా కన్వేన్స్ డీడ్ రిజిస్టర్ చేసి ఉన్నారని తెలిపారు. భగవత సత్యవతి వారసులు ప్రభుత్వం తన సాగులో ఉన్న భూమిని వారికి కేటాయించిందని తనపై దౌర్జన్యం చేస్తున్నారని ఆమె వాపోయారు. ఈ విషయమై తాను స్థానిక తహశీల్దారుకు, పలుమార్లు ఫిర్యాదు చేశానని ఎటువంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ భూమిలో తమ పూర్వీకులు నుండి అనుభవంలో ఉండి సాగు చేస్తున్నామన్నారు. ల్యాండ్ పూలింగ్‌లో తన భూమి ప్రభుత్వం వారు తీసుకున్నట్లయితే తనకు కూడా పరిహారం కింద అభివృద్ధి చేసిన ప్లాట్‌ను కేటాయించాలని కోరారు. అటువంటివి ఏమీ లేనప్పుడు తన స్వాధీనంలో ఉన్న భూమిని వేరొక వ్యక్తికి ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులు స్పందించి దర్యాప్తు చేసి తమకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

అగ్రిగోల్డ్ బాధితులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి-అనకాపల్లి : అగ్రిగోల్డ్ బాధితులపై పోలీసులు పెట్టిన కేసును కోర్టు కొట్టివేసింది. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన 2019లో అప్పటి అనకాపల్లి ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన బాధితులపై అప్పటి పోలీసులు ఎమ్మెల్యే ఇల్లు ముట్టడించారని, రాకపోకలకు అంతరాయం కలిగించారని అభియోగంతో అక్రమంగా కేసు పెట్టారు. సంఘం నాయకులు వైఎన్ భద్రం, కర్రం మాణిక్యాలరావు, మొల్లేటి గోపాల రమణ, కోన లక్ష్మణ, యన్నంశెట్టి సూరిబాబు, జెర్రిపోతుల దుర్గారావు, పొలమరశెట్టి శేషు, ఎస్ అప్పారావు తదితరులపై పెట్టిన కేసు అనకాపల్లి 11వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో విచారణ జరిగింది. నిందితులపై మోపిన కేసులో పోలీసులు సరైన సాక్ష్యం నిరూపించలేకపోవడంతో శుక్రవారం న్యాయమూర్తి కేసును కొట్టివేశారు. బాధితుల తరపున న్యాయవాది కనిశెట్టి సురేష్ బాబు వాదించారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : జీవో నెంబర్ 1217 రద్దు చేసి భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏపి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వియ్యపు రాము డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యాన స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించి తహసీల్దార్ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న 46 వేల క్లెయిమ్‌లను పరిష్కరించి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో బర్నికాన దేముళ్ళు, రాజు, బొట్టా వెంకటేష్, కర్రి పైడికొండ, బి.చిన్న, పెంటరావు, ఎర్రి నాయుడు, నాగరాజు పాల్గొన్నారు.

లోపూడిలో డిజిటల్ సేవలు కరువాయే..

లోపూడి గ్రామ సచివాలయం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం లోపూడి సచివాలయం పరిధిలో ప్రజలు డిజిటల్ సేవలు అందడం లేదు. ఇక్కడ డిజిటల్ అసిస్టెంట్‌గా పని చేసిన శేఖర్ బదిలీల్లో భాగంగా మంగళాపురం సచివాలయానికి బదిలీ అయ్యారు. ఈ సచివాలయానికి కొత్త డిజిటల్ అసిస్టెంట్‌ను ఇంకా నియమించలేదు. దీంతో అప్పట్నుండి ఈ సచివాలయ పరిధిలో ఇక్కడ డిజిటల్ సేవలు లేక రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణ బదిలీలు జరిగి 15 రోజులు కావస్తున్నా లోపూడి సచివాలయానికి డిజిటల్ అసిస్టెంట్ పోస్టును భర్తీ చేయలేదు. డిజిటల్ అసిస్టెంట్ లేక సచివాలయంలో ఆన్లైన్ సేవలను నిలిచిపోయాయి. విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రైతులు పాసుబుక్కులు, పించన్లు ఇలా అన్నిడిజిటల్ సేవలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి లోపూడి సచివాలయం డిజిటల్ ఆపరేటర్‌ను నియమించి ప్రజలకు అందుబాటులో ఉంచాలని పలువురు కోరుతున్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం

సీమంతాల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొణతాల

ప్రజాశక్తి-అనకాపల్లి

తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. తల్లి పాలు వారోత్సవాల్లో భాగంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పుట్టిన గంటలోపు తల్లిపాలు తాగించాలని, తల్లి ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా వంటిదని పేర్కొన్నారు. ప్రభుత్వం గర్భిణులకు అందించే పోషకాహార కిట్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశం అనంతరం తల్లిపాల వారోత్సవాలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్ మల్ల సురేంద్ర, ఎంపీపీ గొర్లి సూరిబాబు, జెడ్పి వైస్ ఛైర్‌పర్సన్ బీవీ.సత్యవతి, తుమ్మపాల ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, ఈవోపీఆర్డి ప్రసాద్, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఆశ, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

వడ్డాది : తల్లిపాలతోనే పిల్లలు దృఢంగా ఆరోగ్యవంతంగా జీవిస్తారని ఐసిడిఎస్ సూపర్వైజర్ నిర్మలాదేవి అన్నారు. బుచ్చయ్యపేట మండలం లోపూడి అంగన్వాడీ కేంద్రం-2లో ఐసిడిఎస్ పిఒ మంగతాయారు ఆధ్వర్యంలో తల్లి పాలు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ పిల్లలు మహిళలతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కడియం జ్యోతి, సత్య, వరహాలమ్మ పాల్గొన్నారు

బుచ్చయ్యపేట : మండలంలోని చిన కందిపూడి అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యాన తల్లిపాలు వారోత్సవాలు సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త అడ్డపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని గణపర్తి గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా అంగన్వాడీలు, చూచుకొండ పిహెచ్‌సి వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ చేపట్టారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ అన్నపూర్ణ మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలలు నిండే వరకు తల్లిపాలు తప్ప ఎటువంటి పదార్థాలు ఇవ్వకూడదని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కాళ్ళ చంద్రమోహన్, మారిశెట్టి వెంకటరమణ, ఆడారి సాంబమూర్తి, హెచ్‌విఏవి బేగం, ఏఎన్ఎం వై సంతోష కుమారి, అంగన్వాడీ టీచర్లు, వివోఏలు పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక 50 పడకల ఆసుపత్రిలో గైనిక్ వార్డులో ఉన్న నవజాత శిశువు తల్లులకు తల్లిపాల విశిష్టతపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ పిఒ పి.లలిత కుమారి మాట్లాడుతూ ఈ నెల 1 నుండి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది సుశీల, అనిత, కళ్యాణి, రాములమ్మ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురం పిహెచ్‌సి వైద్యాధికారి కె శ్రావ్య ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బందితో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ చేశారు. తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని డాక్టర్ శ్రావ్య తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ జి సుహాసిని, సూపర్వైజర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

వడ్డాదిలో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్వాడీలు, పిల్లలు, మహిళలు

నక్కపల్లి : నక్కపల్లి ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. గొడిచెర్ల పి హెచ్ సి పరిధిలో గర్భిణీలు బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఉదయ్ ప్రశాంత్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సి హెచ్ సత్యవతి, ఎం.బి నిషా పాల్గొన్నారు.

నక్కపల్లి వీవర్స్ కాలనీలో అంగన్వాడీ కార్యకర్త దుర్గారాణి ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

రావికమతం : తల్లిపాలతో పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని కొత్తకోట సర్పంచ్ కోన లోవరాజు, ఉపసర్పంచ్ పందల దేవ తెలిపారు. కొత్తకోట అంగన్వాడీ సెక్టార్ పరిధిలో తల్లిపాలు వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జ్యోతీశ్వర్ రెడ్డి, వార్డు సభ్యులు పూడి నాగరాజు, వేమవరపు సత్తిబాబు పాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు తోట వీధి, అప్పికొండ వీధి అంగన్వాడీ కేంద్రాల పరిధిలో తల్లి పాల వారోత్సవాల ప్రాధాన్యత పై అవగాహన ర్యాలీ లు నిర్వహించారు.ఐసిడిఎస్ పీడీ కెవి రామ లక్ష్మి, సిడిపిఒ శ్రీదేవి, నోడల్ అధికారి రూబీ , సూపర్వైజర్ బి నాగమణి, అంగన్వాడీ కార్యకర్తలు వెంకటలక్ష్మి, రమాకుమారి పాల్గొన్నారు.

ఆనందపురం : గంభీరం సెక్టార్ పరిధిలోని వేముల వలస గ్రామంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శిరీష ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు.

ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

పింఛను ఇస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి -అనకాపల్లి : మండలంలోని పిసినికాడ గ్రామంలో కలెక్టర్ విజయకృష్ణన్ శుక్రవారం లబ్ధిదారులకు ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ కె.శచీదేవి, తహశీల్దారు ఎంవి.అప్పారావు, డిప్యూటీ ఎంపిడిఒ ప్రసాద్ పాల్గొన్నారు. అనకాపల్లి జివిఎంసి 82వ వార్డులోనూ, విజయరామరాజుపేట, తుమ్మపాల ప్రాంతాల్లో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ చేతుల మీదగా పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మల్ల సురేంద్ర, భీమరశెట్టి రాంకీ, చదరం నాగేశ్వరరావు, కర్రి బాబి పాల్గొన్నారు.

చోడవరం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద జీవిత భాగస్వామి పింఛన్లు 202 మందికి ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, ఇన్చార్జి ఎంపీడీవో శాంతారామ్ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జీవిత భాగస్వామి పింఛన్లు 196 మందికి ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానోజీరావు, ఎంపీపీ దాకారపు నాగేశ్వరిదేవి పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట గ్రామంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పరమేశ్వరరావు, వేగి గోపికృష్ణ పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలో కొత్తగా 209 స్పౌజ్ పెన్షన్లు మంజూరు కాగా, శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రొంగలి మహేష్, దాడి ఎరుకునాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ : జీవీఎంసీ 81వ వార్డు పిలా వెంకట్ రెడ్డి నాయుడు వీధిలో బుద్ద అప్పారావు భార్య లక్ష్మికి నూతన పెన్షన్ రూ.4000ను మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో కొణతాల బాబురావు, పెంటకోట శివరాం పాల్గొన్నారు.

మునగపాక : మండల కేంద్రం మునగపాకలో ఎన్టీఆర్ భరోసా కొత్త పింఛన్లను ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టెక్కలి పరశురాం, దొడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : కొత్తగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మండలంలోని మార్టూరు గ్రామంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

గొలుగొండ: మండలంలోని కొత్తమల్లంపేట గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపిడిఒ మేరీరోజ్ చేపట్టారు. మండలంలో 165 వితంతు పింఛన్లు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, మాజీ జెడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, చోద్యం పిఎసిఎస్ అధ్యక్షులు చిటికెల సాంబమూర్తి పాల్గొన్నారు.

రోలుగుంట: ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు ఆధ్వర్యంలో శుక్రవారం రోలుగుంట మండల పరిషత్ కార్యాలయంలో వితంతువులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రంలో తహశీల్దార్ నాగమ్మ, ఈఓపిఆర్‌డి దుర్గాప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు పంచాడ చంద్ర, మండల సీనియర్ నాయకులు గుమలూరు చంద్రమౌళి, రోలుగుంట ఎంపిటిసి సుర్ల రామకృష్ణ పాల్గొన్నారు.

కోటవురట్ల: కూటమి ప్రభుత్వం సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ పథకాన్ని దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీనాయుడు అన్నారు. జల్లూరు సుంకపూరు గ్రామాలలో కొత్తగా మంజూరైన వితంతు పింఛన్లను పంపిణీ చేశారు, ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా 162 వితంతు పింఛన్లు మంజూరు అయ్యాయన్నారు. వీటిని జిల్లా నాయకులు కాశీనాయుడు, మండల టిడిపి అధ్యక్షులు లింగన్న నాయుడులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిఏపీఆర్డి కూర్మారావు, సర్పంచులు, గ్రామ కార్యదర్శిలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛను అందజేస్తున్న టిడిపి నేత కాశీనాయుడు

వేపగుంట: జివిఎంసి 94వ వార్డు వేపగుంట బిసి కాలనీలో 485 447 సచివాలయాల పరిధిలో వితంతువులకు కొత్తగా మంజూరైన పింఛన్లను అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు శుక్రవారం పంపిణీ చేశారు. కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు అప్పికొండ వీధి వార్డు సచివాలయం పరిధి గొల్ల వీధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని జెడ్‌సి బమ్మి అయ్యప్ప నాయుడుతో కలిసి కలెక్టర్ ఎం ఎన్ హరేందిర ప్రసాద్ పరిశీలించారు. లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు.

ఆనందపురం : మండలంలోని తర్లువాడలో కొత్తగా మంజూరైన వితంతు పెన్షన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పంపిణీ చేశారు. సుపరిపాలన ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించారు.

విడుదల అవుతున్న నీరు

పెద్దేరు నుంచి నీరు విడుదల

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలో జాలంపల్లి పంచాయతీ రాయిపాలెం వద్ద ఉన్న పెద్దేరు జలాశయం నీటి మట్టం పెరగడంతో శుక్రవారం తెల్లవారుజామున 120 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు పెద్దేరు అసిస్టెంట్ ఇంజనీర్ సుధాకర్ రెడ్డి తెలిపారు.జలాశయంలో గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా, గురువారం తెల్లవారుజామున 136.30 మీటర్లకు చేరుకుంది. అదే సమయంలో 58 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చిందని ఆయన తెలిపారు.నీటి మట్టం పెరగడంతో, దిగువ నదీ ప్రాంతాల్లోకి నీటి ప్రవాహం పెరగకుండా ఉండేందుకు రాచకట్టు ద్వారా 60 క్యూసెక్కులు, ఆర్ఎంసి ద్వారా మరో 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఆయన వెల్లడించారు.

నివాళి అర్పిస్తున్న నాయకులు

దేముడుకు ఘన నివాళి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: సిపిఐ సీనియర్ నాయకులు, రైతు ఉద్యమ నేత కామ్రేడ్ మాకిరెడ్డి దేముడు వర్థంతిని నిర్వహించారు. దేముడు స్థూపం వద్ద శుక్రవారం సిపిఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, నాయకులు రావు జగ్గారావు, ప్రజా సంఘాలు నాయకులు నివాళులర్పించారు. రైతు సంఘం సీనియర్ నాయకులు గంగా భవాని అధ్యక్షతన జరిగిన సభలో మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ, గబ్బాడ గ్రామంలో కామ్రేడ్ దేముడు పుట్టి మరణించే వరకూ ఎర్రజెండా పక్షాన నిలబడి అనేక పోరాటాలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్రనాయకులు బాలేపల్లి వెంకటరమణ, బాపట్ల జిల్లా కార్యదర్శి సింగర్ కొండ,జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, జి.గురుబాబు పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేస్తున్న శాసనసభ్యులు రాజు

ఫీల్డ్ అసిస్టెంట్‌గా కృష్ణమోహన్

ప్రజాశక్తి-రావికమతం: మండలంలో కొమిర పంచాయతీ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా గొంతెన మోహనకృష్ణను గురువారం చోడవరం శాసనసభ్యులు కె ఎస్ ఎన్ ఎస్ రాజు, మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు కోమటి శంకర్రావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. ఇటీవల కొమ్మిర పంచాయితీ నుండి కేబీపీ అగ్రహారం ప్రత్యేక పంచాయతీగా ఏర్పడడంతో కొమిర పంచాయతీకి ఫీల్డ్ అసిస్టెంట్ స్థానం ఖాళీ ఏర్పడింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ కొమిర పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో భాగంగా వంద రోజులు పని కల్పించాలని, ప్రతి కూలీకి 300 రూపాయలు వేతనం తగ్గకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రావికమతం మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు కోమటి శంకర్రావు, ఎంపీడీవో స్వామి, రౌతు సత్తిబాబు, ఆచారి, ఈశ్వరరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ అన్నదాత సుఖీభవ

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల వ్యాప్తంగా అర్హత కలిగిన వారందరికీ అన్నదాత సుఖీభవ అందే విధంగా చర్యలు తీసుకున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారులు బి.సరోజిని తెలిపారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా 10413 మంది లబ్ధిదారులను గుర్తించగా వీరికి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 7000 చొప్పున జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ వర్తిస్తుందా అనే విషయంపై ప్రస్తావించగా ప్రభుత్వం నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు ఇంకా అందాల్సి ఉన్నట్లు తెలిపారు, కౌలు రైతులు కార్డుల దరఖాస్తు ప్రక్రియ ఇంకా కొనసాగుతుందని ఇంతవరకు 221 మందికి రెవెన్యూ అధికారులు కార్డులు అందజేశారని తెలిపారు. కౌలు రైతులు పండించే పంట ఈ క్రాఫ్ అయిన అనంతరం వారికి అన్నదాత సుఖీభవ వర్తిస్తుందని ఆమె తెలిపారు.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

తడి పొడి చెత్తను వేరు చేయాలి

ప్రజాశక్తి - చీడికాడ: గ్రామంలో ప్రజలందరూ కూడా తమ ఇళ్ల వద్ద తడి, పొడి చెత్త వేరు వేరుగా చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించేటట్లు చూడాలని డిప్యూటీ ఎంపీడీవో తెలిపారు. చీడికాడ మండలం జి కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం గ్రామంలో తడి చెత్త పొడి చెత్తపై అవగాహన కల్పించారు.

క్వారీలకు అనుమతివ్వడం దారుణం

పదో రోజుకు దళితుల నిరసన దీక్ష

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : మాకవరపాలెం మండలం జి.కోడూరు సర్వే నెంబర్ 332లో మైనింగ్ కార్యకలాపాలతో దళిత రైతుల జీవనాధారాన్ని దెబ్బతీస్తున్నారని విదసం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు ఆరోపించారు. శుక్రవారం ఆయన జి.కోడూరులో ఉన్న క్వారీని సందర్శించారు. మైనింగ్ కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. గత పది రోజులుగా దళిత రైతులు నర్సీపట్నం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేస్తూ ఈ మైనింగ్ కార్యకలాపాలను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తున్న సంగతి విధితమే. ఈ సందర్భంగా వెంకటరావు శుక్రవారం పదో రోజుకు చేరిన దీక్షా శిబిరాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే అయ్యన్న పాత్రుడు క్వారీని సందర్శించి లీజు రద్దు చేయాలని, లేకపోతే 18వ తేదీ దాటితే అమరావతికి నిరసన చేరుతుందని హెచ్చరించారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ ఈ మైనింగ్ కార్యకలాపాలకు వ్యతిరేకంగా దళిత రైతులకు మద్దతుగా నిలిచిందని గుర్తు చేశారు. దళిత ఓట్లతో అధికారంలోకి వచ్చిన టీడీపీ క్వారీలకు మళ్లీ అనుమతులు ఇవ్వడం దారుణమని ఆయన విమర్శించారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలో ఈ క్వారీలకు వ్యతిరేకంగా టీడీపీ నాయకులు పోరాడి అనుమతులను రద్దు చేయించారని, కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన వెంటనే మళ్లీ అనుమతులు ఇవ్వడం హేయమైన చర్య అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనకాపల్లి ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా చిన్ని యాదవ్ మాట్లాడుతూ, మైనింగ్ రైతుల జీవనోపాధిని, భవిష్యత్తును నాశనం చేస్తోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐ బిఎస్‌పీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొట్టా నాగరాజు, కాంగ్రెస్ నాయకులు బొంతు రమణ, ఓంకార్, గుడివాడ ప్రసాద్ ు నాయకులు అప్పారావు, నాగభూషణం, లావరాజు, పెంటయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షను చేపడుతున్న దళితులు, విదసం నేతలు

నీటి తీరువా పన్నులపై వడ్డీ మినహాయింపు

ప్రజాశక్తి -కోటవురట్ల: నీటి తీరువా పన్నుల వసూళ్ల పట్ల వడ్డీ మినహాయించినట్లు తహసిల్దార్ తిరుమల బాబు అన్నారు. 6శాతం వడ్డీతో సహా వసూలు చేసేందుకు రైతులకు డిమాండ్ నోటీసులు అందజేశారు.తహసిల్దార్ తిరుమల బాబు మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా 1.16 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా తాజాగా ప్రభుత్వం వడ్డీ మినహాయింపుతో 16 లక్షల వెసులుబాటు కలుగు తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని నీటి పన్ను వసూలు పై సహకరించాలని కోరారు.

సీతారామస్వామి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-రావికమతం: రావికమతం ఎంపీడీవోగా ఎస్.వి.సీతారామస్వామి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన ఎంపీడీవో వెంకన్న బాబు ఉద్యోగ విరమణ పొందారు.దీంతో రావికమతం మండల డిప్యూటీ ఎంపీడీవో గా పనిచేస్తున్న సీతారామస్వామి ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టారు. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి వాటి పైన ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి -నర్సీపట్నం:రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న విద్యాశాఖ అధికారి 1 పోస్టులను మేనేజ్మెంట్ స్కూలు అసిస్టెంట్లను ఎఫ్ఏసీలుగా నియమించడం సరికాదని శుక్రవారం నర్సీపట్నం జిల్లా పరిషత్ పాఠశాల వద్ద ఏపీపీఎఫ్, ఏపీయూఎస్ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన నిర్వహించారు. పంచాయతీరాజ్ ఉమ్మడి సర్వీస్‌కు అనుగుణంగా భర్తీ చేయాలని ఉపాధ్యాయ సంఘాలు విన్నవించినప్పటికీ వాటిని పరిగణలోకి తీసుకోకుండా కేవలం ప్రభుత్వ పాఠశాల స్కూల్ అసిస్టెంట్లను నియమించడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు జిల్లా అధ్యక్షులు డిజి నాథ్, రాష్ట్ర నాయకులు అల్లు అప్పారావు, మండల అధ్యక్షులు వరహాలరావు, కార్యదర్శి జీవి రమేష్, ప్రధానోపాధ్యాయులు రత్నం పాల్గొన్నారు.

పంపిణీ చేస్తున్న వైసిపి నాయకులు

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

ప్రజాశక్తి -పాయకరావుపేట:వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా జన్మదిన వేడుకలు శుక్రవారం పాయకరావుపేటలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పట్టణంలోని వై..జంక్షన్‌లో సాయిబాబా కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు బర్త్ డే కేక్ కట్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి లంక సూర్యనారాయణ (సూరిబాబు), వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, మాసాహేబుపేట సర్పంచ్ గెడ్డమూరి శ్రీనివాసరావు, వైసిపి ఏపి రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి కోచల సుందరలత, పార్టీ టౌన్ ప్రెసిడెంట్ మహేష్, సర్పంచ్‌లు పాపారావు, తాతాజీ పాల్గొన్నారు.

దగ్ధమైన సామగ్రి

షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏఎల్.పురం ఆర్టీసీ బస్టాండ్ వెనుక నివసిస్తున్న పైల సూరిబాబు ఇంట్లో గురువారం అర్ధరాత్రి అకస్మాత్తుగా విద్యుత్ మీటర్ల నుంచి దట్టమైన పొగ కమ్ముకొని మంటలు చెలరేగాయి. దీంతో భయంతో బయటకు పరుగులు తీశామని బాధితులు తెలిపారు. ఇంట్లో ఉన్న సోఫా సెట్, పనిముట్లు కాలి దగ్ధమయ్యాయని వాపోయాడు. స్మార్ట్ మీటర్ల కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉంటుందని సూరిబాబు చెబుతున్నాడు.

అధిక లోడు వాహనాలకు జరిమానా

ప్రజాశక్తి -కోటవురట్ల: గత మంగళవారం సభాపతి స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్వయంగా అధిక అధిక లోడుతో వెళ్తున్న వాహనాలను మాకవరపాలెం రాజుపేట గ్రామ సమీపంలో అదుపులోకి తీసుకోవాలని ఆదేశించిన నేపథ్యంలో అధికారులు స్పందించారు. అదుపులోకి తీసుకున్న వాహనాలకు రూ.3,92,000 జరిమానా విధించినట్లు మాకవరపాలెం ఎస్సై దామోదర్ నాయుడు తెలిపారు.

లూలూకు భూకేటాయింపులు రద్దు చేయాలి

- అఖిలపక్ష రాజకీయ పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బహుళజాతి వ్యాపార సంస్థ లూలూకు విశాఖ తీరంలోని ప్రభుత్వ భూములను కారుచౌకగా కట్టబెట్టాల్సిన అవసరం ఏముందని కూటమి ప్రభుత్వాన్ని అఖిలపక్ష రాజకీయ పార్టీలు నిలదీశాయి. పెద్ద ఎత్తున పెట్టుబడులతో భారీ స్థాయి వ్యాపారం చేసుకునే లూలూ మాల్ స్వచ్ఛంద సంస్థ కాదని కూటమి పెద్దలు గ్రహించాలని హితవు పలికాయి. లూలూకు విశాఖ నగరంలో వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం విశాఖలోని నీలం రాజశేఖర రెడ్డి భవనంలో అఖిలపక్ష రాజకీయ పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు షేక్ రహిమాన్, ఎం.జగ్గు నాయుడులు మాట్లాడుతూ విశాఖ నగరంలోని అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని లూలూకు కట్టబెట్టేందుకు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తీరంలోని కోట్ల విలువైన 13.74 ఎకరాల ప్రభుత్వ భూమిని నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ప్రైవేటు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే క్రమంలో ఇటువంటి తప్పుడు నిర్ణయాలు తీసుకుంటోందని అన్నారు. లూలూ యాజమాన్యంతో ప్రభుత్వ పెద్దలు రహస్యంగా చేసుకున్న ఆర్థిక ఒప్పందాల కారణంగానే ఏకపక్షంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఇప్పటికే ఉన్న బహుళ జాతి షాపింగ్ మాల్స్ వల్ల నగరంలో రిటైల్ వ్యాపారం చేసుకునే వేలాది మంది రోడ్డున పడ్డారని గుర్తు చేశారు. లూలూ మాల్ వస్తే బీచ్ రోడ్డులో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వేల మంది ఉపాధి కోల్పోతారన్నారు. కూటమి సర్కారు తీరుమార్చుకోకుంటే ప్రజలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు వై.కొండయ్య, సిపిఐ (ఎంఎల్) ప్రజాపోరు నాయకులు కె.దేవా, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మరుపిళ్ల పైడిరాజు, కె.సత్యనారాయణ, ఎం.మన్మథరావు, సిఎస్.క్షేత్రపాల్, ఆర్.శ్రీనివాస్, ఎంఎ.భేగం, వై.రాంబాబు, సిపిఎం జిల్లా నాయకులు వి.కృష్ణారావు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

బ్రిటీష్ సమాధుల స్థలంలో ఆక్రమణలు తొలగించాలి : సిపిఎం

వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: పట్టణంలో సర్వే నెంబర్ 9 లోని 46 సెంట్లలో బ్రిటిష్ సమాధుల స్థలాన్ని కొంతమంది ఆక్రమించి శాశ్వత భవన నిర్మాణాలు చేపడుతున్నారని, ఇప్పటికే 27 సెంట్లు ఆక్రమణకు గురైందని, వీటిని తొలగించాలని సిపిఎం నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసిల్దారు, ఆర్డీవో కార్యాలయం, మున్సిపల్ కమిషనర్ సురేంద్రకు వినతి పత్రాన్ని సిపిఎం ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తులు రెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ,ఇటీవలే లీగల్ సెల్ చైర్మన్ పురావస్తు శాఖ సిబ్బంది స్థలాన్ని సందర్శించి ఆ స్థలాన్ని క్లీన్ చేయించారన్నారు. సమాధి స్థలాన్ని కాపాడాల్సిన మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఆక్రమణలు తొలగించాల్సిన యంత్రాంగం మౌనం వహించడం పలు అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. ఆక్రమణదారులు దగ్గరుండి మరీ నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ ఏ ఒక్క అధికారి కూడా కన్నెత్తి చూడకపోవడం విస్మయానికి గురి చేస్తుందని తెలిపారు. సామాన్యులు నిర్మాణాలు చేపట్టేటప్పుడు మునిసిపల్ అధికారులు హడావుడి చేసి తొలగిస్తుంటారని, వీటిపై ఎందుకు చర్యలు ఎందుకు తీసుకోలేదని డిమాండ్ చేశారు.ఇది కేవలం సమాధులున్న స్థలం మాత్రమే కాదని దీనికొక చరిత్ర ఉందని గుర్తు చేశారు. ఇలాంటి చారిత్రక స్థలాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదని తెలిపారు. అల్లూరి సీతారామరాజు ఉద్యమ స్ఫూర్తి చిహ్నాలుగా వున్న ఈ బ్రిటీష సమాధుల స్థల ఆక్రమణలు తొలగింపునకు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆక్రమణదారులు వారికి సహకరిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు దోచేస్తున్న ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు.

క్వారీని పరిశీలిస్తున్న సత్యనారాయణ

గ్రావెల్ అక్రమ తవ్వకాలను నిలిపేయాలి

ప్రజాశక్తి -యస్.రాయవరం: పెద్దగుమ్ములురు రెవెన్యూ పరిధిలో డి పట్టా భూముల్లో గ్రావెల్ అక్రమతవ్వకాలను నిలిపి వేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం సత్యనారాయణ డిమాండ్ చేశారు. క్వారీ కంకర్తు తవ్వకాల ప్రదేశాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, మేడకొండ సర్వే నెంబర్లు 513 /6నుండి 513/ 13 వరకు గల డి పట్టా భూముల్లో గ్రావెల్ తవ్వకాలు విపరీతంగా జరుగుతున్నాయన్నారు. అడ్డు అదుపు లేకుండా మట్టిని, ఇసుకని గ్రావెల్ కంకర దోచుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి రోజు రాత్రి సమయం చూసుకొని తవ్వుతున్నారన్నారు.

నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -పాయకరావుపేట: శ్రీ ప్రకాష్ విద్యా సంస్థ అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో రోటరాక్ట్ క్లబ్స్ ఆఫ్ యంగ్ లీడర్స్ అండ్ సబల డిస్ట్రిక్ట్ 3020 నూతన కార్యవర్గం శుక్రవారం పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. రోటరాక్టర్ చంద్రవర్ధన్, అనురాధ అధ్యక్షులుగా నియమితులు య్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ వై.కళ్యాణ్ చక్రవర్తి, గౌరవ అతిదులుగా డిస్ట్రిక్ట్ కమిటీ కో- చైర్మన్ నాగ సురేష్, డిస్ట్రిక్ట్ రోటరాక్ట్ రిప్రెజెంటేటివ్ కృష్ణ కేదారశెట్టి హాజరయ్యారు. కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ, యువత సేవా కార్యక్రమాలలో మమేకమవ్వాలనే ఈ రోటరాక్ట్ క్లబ్ లను ప్రోత్సహిస్తున్నామన్నారు. గత సంవత్సరం శ్రీ ప్రకాష్ రోటరాక్ట్ క్లబ్ ద్వారా పోలియో నిర్మూలన కోసం లక్ష రూపాయలు విరాళమివ్వడం రోటరాక్ట్ సభ్యుల సేవానిరతికి ప్రతిబింబమని ఆయన తెలిపారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ, తమ విద్యార్థులు రోటరాక్ట్ క్లబ్ ద్వారా సమాజానికి అవసరమైన సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమం లో రోటరీ క్లబ్ అధ్యక్షులు నాగిరెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అభినందిస్తున్న కాలేజీ కార్యదర్శి

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

- గురుకులం ప్రిన్సిపల్ ఉషారాణి

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల (బాలికలు) లో మిగులు సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు ప్రిన్సిపల్ యు ఉషారాణి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ, 5వ తరగతి, ఇంటర్మీడియట్ (ఎస్సి)లో మిగులు సీట్ల భర్తీకి చర్యలు చేపడుతున్నామని, పాఠశాలలో చేరాలనుకునే ఎస్సి కులాలకు చెందిన విద్యార్థినిలు నేరుగా ఆధార్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రములతో హాజరైతే, వాటిని పరిశీలించి గురుకులంలో చేర్చుకుంటామని ప్రిన్సిపాల్ ఉషారాణి వెల్లడించారు. ఈ అవకాశాన్ని విద్యార్థినిలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.